

నెలలు నిండకుండానే..



- అవగాహనతో ప్రీమెచ్యూరిటీ ప్రసవాలకు చెక్
- గర్భం దాల్చినప్పటి నుంచి పోషకాహారం తీసుకోవాలి
- నిరంతరం వైద్య పరీక్షలు చేయించుకుంటుండాలి
- ముందే ప్రసవం అయితే అనేక రకాల సమస్యలు
- నేడు ప్రీమెచ్యూరిటీ డే

- 8లో

అధ్వాన దారులు అందంగా..

ఆర్ అండ్ బీ పరిధిలో 346 కిలో మీటర్ల మేర రోడ్లపై గోతులు

పనులకు రూ.5.29 కోట్లు మంజూరు చేసిన కూటమి ప్రభుత్వం

- సంక్రాంతి నాటికి పూర్తి కావాలని ఆదేశం
- అధికారుల పర్యవేక్షణలో పనులు వేగవంతం
- గత వైసీపీ పాలనలో నరకం చూసిన వాహనచోదకులకు ఊరట



ఈ ఏడాది సెప్టెంబరులో అధ్వానంగా ఉన్న పరవాడ సినిమాహాల్ జంక్షన్ వద్ద రహదారి (ఫైల్ ఫొటో)



ప్రస్తుతం ఇలా..

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని అధ్వాన రోడ్లకు మహర్దశ పట్టనుంది. గత వైసీపీ పాలనలో రహదారుల నిర్వహణను గాలికి వదిలేయడంతో ఎక్కడికక్కడ పెద్ద గోతులతో దర్శనమిచ్చేవి. వాహన చోదకులు నిత్యం నరకం చూసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రహదారుల అభివృద్ధిపై దృష్టి పెట్టడంతో రోడ్లు అద్దంలా మెరిసిపోతున్నాయి.

జిల్లాలో రహదారులు, భవనాల శాఖ పరిధిలో గుంతలు లేని రోడ్లే లక్ష్యంగా నిర్వహణ పనులకు కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఆర్ అండ్ బీ పరిధిలోని 346 కిలో మీటర్ల రోడ్లపై పడిన గుంతలు పూడ్చేందుకు 68 ప్యాచ్ వర్కులను అధికారులు గుర్తించారు. ఈ పనులకు ప్రభుత్వం రూ.5.29 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు పిలవగా కేవలం నర్సీపట్నం, సబ్బవరం మండలాల్లో సుమారు రూ.19 లక్షలు విలువ చేసే రెండు వేర్వేరు రోడ్డు పనులకు మాత్రమే టెండర్లు దాఖలు కాలేదు. మిగిలిన 66 రోడ్డు పనులకు ఆర్ అండ్ బీ ఇంజనీర్లు టెండర్లు ఖరారు చేశారు. ఇప్పటికే టెండర్లు ద్వారా పనులు పొందిన కాంట్రాక్టర్లు 22 రోడ్డు పనులను ప్రారంభించారు. సీఎం చంద్రబాబు పరవాడలో శంకుస్థాపన చేసి ప్రారంభించిన రోడ్డు పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. ఒకటి, రెండు రోజుల్లో మిగిలిన రోడ్డు ప్యాచ్ పనులు ప్రారంభించనున్నారు. సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లు ఉండాలని సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ విజయకృష్ణన్ జిల్లాలో గుంతలు లేని రోడ్ల నిర్మాణ పనులపై ప్రత్యేక దృష్టి సారించారు. అనుకున్న లక్ష్యాలకు అనుగుణంగా పనులు పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ ఇంజనీర్లకు సమీక్షల ద్వారా దిశా నిర్దేశం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఆర్ అండ్ బీ రోడ్ల నిర్వహణకు ఒక్క పైసా విదల్చకుండా ఇతరత్రా పనులకు ఆర్ అండ్ బీ నిధులను దారి మళ్లించింది. దీంతో జిల్లాలో 11 వందల కిలో మీటర్ల ఆర్ అండ్ బీ రోడ్లలో దాదాపు సగానికి పైగా రోడ్లు ధ్వంసమయ్యాయి. ఆయా రోడ్లపై ఏర్పడిన పెద్ద, చిన్న గుంతలను పూడ్చడం ద్వారా ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చేసే ఉద్దేశంతో జిల్లాలో రోడ్లకు మరమ్మతు పనులు ... మిగతా 8వ పేజీలో

అద్దంలా పరవాడ రోడ్డు



ఊటగెడ్డ జంక్షన్ సమీపంలో పూర్తయిన రహదారి పనులు

పరవాడ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి):

గాజువాక-ఎలమంచిలి ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిలో పరవాడ పెట్రోల్ బంకు జంక్షన్ నుంచి రావాడ శివారు బొట్టవానిపాలెం వరకు పూర్తిగా దెబ్బతిన్న రోడ్డుకు అధికారులు మరమ్మతులు చేపట్టారు. భారీ గోతులను కప్పడమే కాకుండా తారు రోడ్డు వేశారు. ఐదేళ్ల తరువాత రహదారి బాగుపడడంతో వాహనదారులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గాజువాక- ఎలమంచిలి ప్రధాన రహదారి నిత్యం రద్దీగా వుంటుంది. సింహాద్రి ఎన్టీపీసీ, ఫార్మాసిటీ, అచ్యుతాపురం సెజ్, రాంబిల్లి ఎన్ఏవోబీలకు వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. భారీ వాహనాలు అధిక లోడుతో ప్రయాణించడంతో రహదారి పలుచోట్ల ఛిద్రమై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. కానీ గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో ఒక్క గొయ్యిని కూడా పూడ్చలేదు. దీంతో రాకపోకలకు వాహన చోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రయాణ సమయం కూడా రెట్టింపు అయ్యింది. ఇక వర్షాకాలంలో పరిస్థితి మరింత దయనీయంగా వుండేది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నవంబరు రెండో తేదీన పరవాడలో పర్యటించి గుంతల పూడ్చివేత పనులకు శ్రీకారం చుట్టారు. సంక్రాంతి నాటికి రాష్ట్రంలో ఒక్క రహదారిపైన కూడా గొయ్యి వుండడానికి వీల్లేదని ఆయన అధికారులను ఆదేశించారు. దీంతో ఆర్అండ్‌బీ అధికారులు పరవాడ పెట్రోల్ బంకు జంక్షన్ నుంచి రావాడ శివారు బొట్టవానిపాలెం వరకు రోడ్డుపై గోతులను పూడ్చివేసి తారు లేయర్ వేశారు. దీంతో కష్టాలు తీరాయని వాహనచోదకులు, ప్రయాణికులు ఊపిరిపీల్చుకుంటున్నారు.

పరవాడ ఎస్ఐపై సస్పెన్షన్ వేటు

సివిల్ తగాదాల్లో జోక్యమే కారణం



సస్పెన్షన్‌కు గురైన ఎస్ఐ మొయ్యి రామారావు

- న్యాయం చేయాలని వేడుకున్న బాధితురాలిపై కేసు నమోదు
- కేసు ఎత్తివేతకు లంచం ఇవ్వాలని డిమాండ్
- లంచం ఇచ్చినా కేసు తొలగించని వైనం
- నాతవరంలో వ్యవహారం.. పరవాడలో బాధ్యతలు
- ఉన్నతాధికారులను ఆశ్రయించిన బాధితురాలి కుటుంబ సభ్యులు
- విచారణ జరిపి ఎస్ఐపై చర్యలు

అనకాపల్లి రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి):

పరవాడ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న మొయ్యి రామారావుపై సస్పెన్షన్ వేటు పడింది. ఆయన గతంలో నర్సీపట్నం పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో గల నాతవరం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహించిన సమయంలో భూ వివాదం(సివిల్ మేటర్)లో అందిన ఫిర్యాదుపై నమోదు చేసిన కేసు విచారణలో లోపాలు, బాధితులకు న్యాయం చేసేందుకు లంచం తీసుకోవడం నిరూపణ కావడం తదితర అభియోగాలపై అతనిని సస్పెండ్ చేస్తూ విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్‌జెట్టీ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్ఐ సస్పెన్షన్‌కు సంబంధించి వివరాలివి. మొయ్యి రామారావు సార్వత్రిక ఎన్నికల అనంతరం సాధారణ బదిలీల్లో పరవాడ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఆయన బదిలీపై ఇక్కడకు రాక ముందు నర్సీపట్నం సబ్‌డివిజన్ పరిధిలోని నాతవరం ఎస్ఐగా పనిచేశారు. ఆ సమయంలో అదే మండలానికి చెందిన లాలం అమ్మాజీ భాగ్యలక్ష్మికి, వేరే వర్గానికి చెందిన వ్యక్తుల మధ్య తలెత్తిన భూ వివాదంలో అమ్మాజీ తనకు న్యాయం చేయాలని ఎస్ఐ రామారావును వేడుకున్నారు. భూమిపై అనుభవ హక్కు కింద రెవెన్యూ శాఖ అధికారులు జారీ చేసిన పొజిషన్ ధ్రువపత్రాన్ని కూడా ఆమె ఎస్ఐకు చూపించినప్పటికీ పట్టించుకోకుండా క్రిమినల్ కేసు నమోదు చేశారు. రూ.10 లక్షలు లంచం ఇస్తేనే కేసు ఎత్తి వేస్తానని, లేకుంటే జైలుకు పంపుతానని భయపెట్టారు. ఆమె ప్రభుత్వ ఉద్యోగి కావడంతో కేసు ఎత్తివేయించుకునేందుకు రూ.10 లక్షలు ఇవ్వడానికి అంగీకరించారు. దీనిలో భాగంగా దఫదఫాలుగా రూ.3 లక్షలు ఎస్ఐకి చెల్లించింది. అయినా ఆమెపై కేసును యథావిధిగా కొనసాగించారు. ఈలోగా బదిలీపై పరవాడ పోలీస్ స్టేషన్‌కు వచ్చేశారు. బాధిత మహిళ తన కేసు ఎత్తివేతకు మార్గాలు చూపాలని, సలహాలు ఇవ్వాలని ఎన్నిసార్లు వేడుకున్నప్పటికీ ఎస్ఐ రామారావు పట్టించుకోలేదు. దీంతో బాధితురాలు ఉన్నతాధికారులను సంప్రతించి తనకు జరిగిన అన్యాయంపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. దీనిపై విచారణకు విశాఖపట్నం రేంజ్ డీఐజీ ఆదేశించారు. వారం రోజుల క్రితం ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపారు. కేసు విచారణలో లోపాలు, అన్యాయంగా కేసు నమోదు చేయడం, బెదిరించి లంచం తీసుకోవడం, రికార్డులు సమగ్రంగా నిర్వహించలేదని నిర్ధారించారు. నివేదికను విశాఖపట్నం రేంజ్ డీఐజీకి అందజేశారు. దీంతో ఎస్ఐ రామారావుపై సస్పెన్షన్ వేటు పడింది. ఉన్నతాధికారులకు తెలియకుండా హెడ్‌క్వార్టర్స్‌ను విడిచి వెళ్లరాదని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గ్రానైట్ క్వారీలో ట్రాక్టర్ బోల్తా

- డ్రైవర్ మృతి



ప్రమాదానికి గురైన ఎయిర్ కంప్రెషర్ ట్రాక్టర్



కిముడు రాము మృతదేహం

మాడుగుల రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని అవురువాడ పంచాయతీ సీతబందల గిరిజన గ్రామంలో గల నేషనల్ గ్రానైట్ క్వారీలో శనివారం ఎయిర్ కంప్రెషర్ ట్రాక్టర్ కొండ పైనుంచి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. దీనికి సంబంధించి ఎస్ఐ నారాయణరావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి.

రావికమతం మండలం బుడ్డిబంద గిరిజన గ్రామానికి చెందిన కిముడు రాము (35) మాడుగుల మండలం అవురువాడ పంచాయతీ సీతబందలు గ్రామంలో గల నేషనల్ గ్రానైట్ క్వారీలో ట్రాక్టర్ డ్రైవర్, డ్రిల్లింగ్ పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం పదకొండు గంటలకు కొండ దిగువ నుంచి గ్రానైట్ దిమ్మలకు డ్రిల్లింగ్ పనులు చేసేందుకు కంప్రెషర్‌తో ఉన్న ట్రాక్టర్‌ను కొండ మీదకు నడుపుకుంటూ తీసుకు వెళుతుండగా సుమారు 40 అడుగుల పైకి వెళ్లిన తరువాత అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడింది. ట్రాక్టర్ కొండ దిగువన ఉన్న గ్రానైట్ దిమ్మలపై పడిపోవడంతో రాము అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాధిత కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలని బంధువులు డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించబోమని అక్కడే ఉండిపోయారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ నారాయణరావు పరిశీలించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఆయన తెలిపారు.

అంగన్‌వాడీల ధర్నా



మినీ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ధర్నా చేశారు. ముందుగా సీఐటీయూ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి నెహ్రూచౌక్‌లోని బస్టాప్ వద్ద ధర్నా నిర్వహించారు. - వార్త 8వ పేజీలో..

రక్త సేకరణకు అవాంతరాలు

నిధుల లేమితో తిరగని వాహనం

- రక్తదాన శిబిరాలు అంతంత మాత్రమే
- ఈ ఆర్థిక సంవత్సరంలో నిధులు విడుదలకాక ఇబ్బందులు



నర్సీపట్నం ప్రాంతీయ ఆస్పత్రిలో రక్త సేకరణ వాహనం

నర్సీపట్నం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి):

రక్త సేకరణ (బీసీటీవీ) రవాణా వాహనాన్ని నిధులు లేమి సమస్య పట్టి పీడిస్తున్నది. దీంతో రక్తదానంపై అవగాహన కల్పించడానికి, రక్త సేకరణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

రక్త సేకరణ రవాణా వాహనం నిర్వహణకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిధుల కేటాయింపు జరగకపోవడంతో పెట్రోల్ అవసరాలకు అవస్థలు తప్పడం లేదు. గత టీడీపీ ప్రభుత్వంలో ఉమ్మడి విశాఖ జిల్లాకి రక్త సేకరణ వాహనం మంజూరైంది. ఇందులో ల్యాబ్ టెక్నీషియన్‌లు ఇద్దరు, ఒక డ్రైవర్ విధులు నిర్వహిస్తారు. అప్పట్లో మంత్రిగా ఉన్న అయ్యన్నపాత్రుడు చొరవ ఫలితంగా నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి రక్త నిధి కేంద్రానికి ఈ వాహనాన్ని అనుసంధానం చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎక్కడ రక్తదాన శిబిరం జరిగినా అక్కడకు వాహనం వెళ్లి దాతల నుంచి రక్త సేకరణ చేయాల్సి ఉంటుంది. నెలలో 20 రక్తదాన శిబిరాలు నిర్వహించాలని లక్ష్యం ఉంది. సినిమా థియేటర్లు, ప్రధాన కూడళ్లు, ఆర్టీసీ కాంప్లెక్స్, కళాశాలలు వద్దకు ఈ వాహనం వెళ్లి రక్తదానంపై అవగాహన కల్పించి దాతలను ప్రోత్సహించాలి. నెలలో 15 రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. వాహనం తిరిగిన కిలోమీటర్లు బట్టి ప్రతీ రోజు పెట్రోల్ అవసరం పడుతుంది. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ద్వారా ప్రతీ సంవత్సరం రూ.1.6 లక్షలు వరకు నిధులు కేటాయిస్తుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్వహణకు నిధులు కేటాయింపులు జరగ లేదు. దీంతో వాహనం నిర్వహణకు ఇబ్బంది పడుతున్నట్టు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో మే నెలలో ఏపీ శాక్స్ రూ.50 వేలు నిధులు విడుదల చేసింది. ఈ నిధులు పెట్రోల్ నిర్వహణకు ఖర్చు అయిపోవడంతో ఇప్పుడు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. రక్తదాన శిబిరాలకు దూర ప్రాంతాలకు వెళ్లాలంటే బంకులో పెట్రోల్ అరువు పోయించుకుంటున్నారు. బాగా దూర ప్రాంతాలకు వెళ్లాలంటే పెట్రోల్ ఖర్చును దృష్టి పెట్టుకొని వాహనం వెళ్లడం లేదు. దీని ప్రభావం రక్తదాన శిబిరాలపై పడుతోంది. రక్తదాన శిబిరాలు తగ్గిపోవడం వల్ల ఏరియా ఆస్పత్రికి సమకూరే యూనిట్లు కూడా తగ్గిపోతున్నాయి. ఉన్నతాధికారులు రక్త సేకరణ వాహనం నిర్వహణకు నిధులు మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు.

స్కై సైక్లింగ్ ట్రయల్ రన్



స్కై సైక్లింగ్

- ఇప్పటికే జిప్ లైనర్ రెడీ
- త్వరలో ప్రజాప్రతినిధుల చేతులమీదుగా ప్రారంభం
- వారం రోజుల్లో గ్లాస్ బ్రిడ్జి పనులు మొదలు

విశాఖపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి):

కైలాసగిరిపై అడ్వంచర్ స్పోర్ట్స్ పనులు ఒక్కొక్కటిగా పూర్తిచేస్తున్నారు. అక్టోబరు నెలలో జిప్ లైనర్ పూర్తిచేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు స్కై సైక్లింగ్ ప్రాజెక్టు కూడా పూర్తయింది. గత వారం రోజులుగా ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు. వీఎంఆర్‌డీఏ అధికారులు మంచి ముహూర్తం చూసుకొని ప్రజాప్రతినిధుల చేతులు మీదుగా వీటిని ప్రారంభించాలని యోచిస్తున్నారు.

వారం రోజుల్లో గ్లాస్ బ్రిడ్జి పనులు

కైలాసగిరిపై అడ్వంచర్ స్పోర్ట్స్ పనులను ఆర్‌జే అడ్వంచర్స్ సంస్థ చేపట్టింది. రెండు టువే జిప్ లైనర్లు, రెండు స్కై సైక్లింగ్ లైన్లు ఏర్పాటుచేసింది. కైలాసగిరిపై టైటానిక్ వ్యూ పాయింట్ వద్ద మరో వారం రోజుల్లో గ్లాస్ బ్రిడ్జి పనులు చేపట్టాలని నిర్ణయించింది. దీని పొడవు 50 మీటర్లు. ఇది కొండల మీదుగా ... మిగతా 8వ పేజీలో

ప్రతి విద్యార్థికి అపార్ నంబరు

పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

- శత శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ప్రణాళిక
- జిల్లా విద్యాశాఖాధికారి జి.అప్పారావునాయుడు



జి.అప్పారావు నాయుడు, డీఈవో

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ప్రతి విద్యార్థికి ఆటోమేటెడ్ పర్మినెంట్ ఎకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) నంబరు జారీ చేస్తున్నామని, పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ప్రణాళిక అమలు చేస్తున్నామని జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు తెలిపారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన అనకాపల్లి డీఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా విద్యాశాఖ ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలను 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి వివరించారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరిగే వరకు ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లాలో 21,793 మంది బాలబాలికలు పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్నారని చెప్పారు. రోజూ పాఠశాల ప్రారంభ సమయానికి ముందు ఒక గంట, సాయంత్రం పాఠశాల సమయం ముగిశాక మరో గంట వారికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలో మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో అపార్ రిజిస్ట్రేషన్లు జోరుగా సాగుతున్నాయన్నారు. హైస్కూల్ విద్య నుంచి ఆధార్ నంబరు మాదిరిగా ఇంటర్మీడియట్ వరకు ప్రతి విద్యార్థికి శాశ్వతంగా అపార్ నంబరు ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపడుతోందన్నారు. జిల్లాలో ... మిగతా 8వ పేజీలో

వ్యర్థాల రీసైక్లింగ్‌తో సుస్థిర అభివృద్ధి

▸ ఐఐపీఏ మాజీ డైరెక్టర్ డాక్టర్ వీఎస్ఆర్‌కే ప్రసాద్



మాట్లాడుతున్న ఐఐపీఏ మాజీ డైరెక్టర్ డాక్టర్ వీఎస్ఆర్‌కే ప్రసాద్

పాయకరావుపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వ్యర్థాలను రీసైక్లింగ్‌చేసే ప్రక్రియ అభివృద్ధి చేయడం ద్వారా పర్యావరణ సుస్థిర సాధ్యమవుతుందని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ మాజీ డైరెక్టర్ డాక్టర్ వీఎస్ఆర్‌కే ప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పెసెస్ డిగ్రీ కళాశాలలో 'పర్యావరణ సమస్యలు, సుస్థిర అభివృద్ధి' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన పాల్గొని విద్యార్థులనుద్దేశించి ఆయన ప్రసంగించారు. శిలాజ ఇంధన వనరులకు ప్రత్యామ్నాయంగా సౌరశక్తి, పవన శక్తి, హైడ్రోజన్ ఇంధన శక్తిని ఉపయోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీప్రకాష్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ డాక్టర్ కంటిపూడి నారేంద్రబాబు, శాస్త్రవేత్త ఎల్.నగేశ్, సంయుక్త కార్యదర్శి సీహెచ్. విజయ్‌ప్రకాష్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రామకృష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శివ స్వాములు భిక్షాటన



కుమారపురంలో భిక్షాటన చేస్తున్న శివ స్వాములు

పాయకరావుపేట రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమారపురం, రాజగోపాలపురం గ్రామాలకు చెందిన శివ స్వాములు శనివారం గ్రామంలో భిక్షాటన కార్య క్రమం చేశారు. కార్తీక మాసం మూడో సోమవారం రాజగోపాలపురంలోని ఉమా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో నిర్వహించనున్న భారీ అన్న సమారాధనకు ఇంటింటికి తిరిగి భిక్షాటన చేసి ఆహార దినుసులు సేకరిస్తున్నట్టు శివ స్వాములు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు శివ శంకర స్వామి, నీలాపు బాలకృష్ణారెడ్డి, అప్పలరెడ్డి, రావాడ గోవిందరెడ్డి, చుక్క బాల గోపాలరెడ్డి, గిన్ని దుర్గారెడ్డి, నీలాపు వెంకటరెడ్డి, శివ మాతలు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యమకర్తలకు నివాళి



అయ్యంకి, గాడిచెర్ల తదితరుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నాయకులు

పాయకరావుపేట, నవంబరు 16 : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక వైఎస్ఆర్. శాఖా గ్రంథాలయంలో శనివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యమకర్తలు అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం, గాడిచెర్ల హరిసర్వోత్తమరావు చిత్రపటాలకు ఎంపీపీ ఇసరపు పార్వతి, జడ్పీటీసీ సభ్యులు లంక సూరిబాబు, వైస్ ఎంపీపీ ధనిశెట్టి మాధవి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఇన్‌చార్జి లైబ్రేరియన్ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల విద్యార్థులకు పద్యపఠన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఇసరపు తాతారావు, జగతా శ్రీనివాసరావు, పట్టణ వైసీపీ అధ్యక్షులు ధనిశెట్టి బాబి, ధనిశెట్టి బుజ్జి, తులసీరామ్, కేశనకుర్తి సత్తిబాబు పాల్గొన్నారు.

భూ రీ సర్వేలో సవరణలకు 639 దరఖాస్తులు



పెదతీనార్లలో సర్వే పరిశీలిస్తున్న తహసీల్దార్ నర్సింహమూర్తి

పాయకరావుపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల వ్యాప్తంగా నిర్వహించిన రీ సర్వే భూ సమస్యల పరిష్కార గ్రామసభలకు 639 దరఖాస్తులు వచ్చినట్టు తహసీల్దారు జి.సత్యనారాయణ తెలిపారు. శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 16 రెవెన్యూ గ్రామాల్లో గత నెల 17వ తేదీ నుంచి శనివారం వరకు గ్రామసభలు నిర్వహించినట్టు చెప్పారు. వీటిలో సత్యవరంలో అత్యధికంగా 88 దరఖాస్తులు రాగా, పాయకరావుపేటలో తక్కువగా ఐదు దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిపై విచారణ చేపట్టి సవరణలతో త్వరలో కొత్త పాసుపుస్తకాలు జారీ చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సీహెచ్ఆర్‌కే.వర్మ, రీ సర్వే డీటీ రాజేంద్రప్రసాద్, మండల సర్వేయర్ పి.శ్రీనివాస్‌తోపాటు టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, వైసీపీ నాయకులు జగతా శ్రీనివాస్, ధనిశెట్టి బుజ్జి, వీఆర్వోలు పాల్గొన్నారు.

పెదతీనార్లలో భూముల సర్వే

నక్కపల్లి: పెదతీనార్ల రెవెన్యూ పరిధిలో భూముల సర్వే ప్రక్రియను శనివారం ప్రారంభించారు. నేవల్‌బేస్ ఎస్‌డీసీ కె.మనోరమ, తహసీల్దార్ నర్సింహమూర్తి, ఈ సర్వేను పరిశీలించారు. రెవెన్యూ సిబ్బందికి ప్రభుత్వ భూములు, డీ పట్టా భూములు, సాగుభూములు, జిరాయితీ భూములపై సమగ్ర నివేదికివ్వాలని ఆదేశించారు.

'సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలి'



మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు చిట్టిబాబు

పాయకరావుపేట రూరల్, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలుపొందేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని టీడీపీ మండల అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి, నాయకులు తోట నగేశ్ అన్నారు. శనివారం మండలంలోని శ్రీరాంపురం మురా కాలువ పరిధిలోని రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో కూటమి శ్రేణులు సాగునీటి సంఘాలకు ఉమ్మడి అభ్యర్థిని నిర్ణయించుకుని గెలుపునకు పాటు పడాలన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో సాగునీటి సంఘాలను నిర్వీర్యం చేసి సాగునీటి కాలువలను పట్టించుకోకుండా వదిలేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గారా కృష్ణప్రసాద్, టీడీపీ నాయకులు గొర్లె రాజుబాబు, కంకిపాటి వెంకటేశ్వరరావు, బొంది కాశీ విశ్వనాథ్, మజ్జూరి నారాయణరావు, చించలపు ప్రదీప్, మజ్జూరి నారాయణరావు రైతులు పాల్గొన్నారు.

ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు

పాయకరావుపేట: తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పాయకరావుపేటలో శనివారం ముమ్మంగా చేపట్టారు. పట్టణంలోని కంటోన్మెంట్ ఏరియా తదితర ప్రాంతాల్లో టీడీపీ మాజీ మండల ఉపాధ్యక్షులు గొర్రెల రాజబాబు, నాయకులు మజ్జూరి నారాయణరావు తదితరులు పాల్గొని పార్టీ సభ్యత్వ నమోదుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొల్లపల్లి నాగు, తలారి రాజా, భజంత్రీల శివ, బంగారి లక్ష్మణ్, ఎం.జగదీశ్,అప్పారావు పాల్గొన్నారు.

పత్రికలకు తగ్గని ఆదరణ



ఆస్పత్రిలో రోగులకు రొట్టెలు అందిస్తున్న జర్నలిస్ట్ సంఘ ప్రతినిధులు

నక్కపల్లి, నవంబరు 16: జాతీయ పత్రికాదినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పాయకరావుపేట ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీయుడబ్ల్యూజే జిల్లా సెక్రటరీ కోరాడ చంద్రరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వాస్తవికమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు అందించడంలో పత్రికలు ముందుంటాయని, సాంకేతిక పెరిగిన ఈ రోజుల్లో కూడా పత్రికలకు ఆదరణ తగ్గడం లేదన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రమణబాబు, మురళీకృష్ణ, రాంబాబు, పెంటయ్య, వెంకటేశ్, ఆస్పత్రి సూపరిటెండెంట్ డాక్టర్ శిరీష పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం: ఎంపీడీవో

పాయకరావుపేట రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పలు గ్రామాల్లో శనివారం కలెక్టరు ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పారిశుధ్య పనులు చేపట్టినట్టు ఎంపీడీవో ఎ. జయప్రకాశరావు అన్నారు. ఈ సందర్భంగా ఎప్పటికపుడు గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. దోమల మందును పిచికారీ చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ సీహెచ్, చంద్రశేఖరరావు, పంచాయతీ కార్యదర్శులు వై.వి. సత్యనారాయణ, రామగోవిందు పాల్గొన్నారు.

నక్కపల్లి: పరిసరాల పరిశుభ్రతోనే రోగాలను దరి చేరవని ఎంపీడీవో డీ సీతారామరాజు సూచించారు. జీ జగన్నాధపురంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్‌డీ శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ మారిశెట్టి నానాజీ పాల్గొన్నారు.

కమ్యూనిస్టు నేత ముద్దా తమ్మయ్యకు ఘన నివాళి

నక్కపల్లి, నవంబరు 16: నక్కపల్లికి చెందిన దివంగత కమ్యూనిస్ట్ నాయకుడు ముద్దా తమ్మయ్య వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఆయన స్థానిక స్థూపం వద్ద సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్, బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు కోసూరి శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరిసర గ్రామాల్లో పీడిత వర్గాల పక్షాన నిలిచిన మహనీయుడని పలువురు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో కొప్పిశెట్టి వీరబాబు, అద్దూరి లోవరాజు, పెదిరెడ్డి రమేశ్,అల్లాడ తాతారావు, ముద్దారాజు, నానిబాబు, దేవర వీరబాబు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లు అరెస్టు

ఎస్. రాయవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై శనివారం దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేయడంతో పాటు వారినుంచి రూ 9,040 స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక ఎస్ఐ విభీషణరావు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసినట్టు చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

సెల్ టవర్ నిర్మాణ పనులు నిలిపివేయాలి



మంగవరంరోడ్డులో ఆందోళన చేస్తున్న ప్రజలు

పాయకరావుపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మంగవరంరోడ్డులో నివాసాల మధ్య చేపట్టిన సెల్ టవర్ నిర్మాణ పనులు నిలిపివేయాలని పరిసర వాసులు డిమాండ్ చేశారు. శనివారం ఈమేరకు సెల్‌టవర్ నిర్మాణ ప్రదేశంపై ఆందోళన చేశారు. ఈ సందర్భంగా జగతా నాగరాజు, శ్రీనివాసగంగాధర్, శేషారావు, అమ్మిరాజు తదితరులు మాట్లాడుతూ పట్టణంలో మంగవరం జంక్షన్‌కి సమీపంలో ఇళ్ల మధ్య అనుమతులులేకుండా సెల్ టవర్ నిర్మాణాన్ని తామంతా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ సెల్ టవర్‌తో ఈ ప్రదేశంలో రేడియేషన్ పెరిగి ప్రజలు పలు రోగాలబారిన పడే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి సెల్ టవర్ నిర్మాణ పనులు నిలిపివేయాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పాల అప్పలస్వామి, పత్రి సత్యేంద్రకుమార్, శరత్‌కుమార్, కర్రి శ్రీను, చిట్టూరి లచ్చబాబు తదితరులు పాల్గొన్నారు.

పద్య పఠనంలో పెదబోదిగల్లం బాలికకు ప్రథమ స్థానం



బాలికకు సర్టిఫికెట్‌ను బహూకరిస్తున్న ఉపాధ్యాయులు

నక్కపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని నర్సీపట్నంలో ఈ నెల 14న పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయివిజ్ఞాన పోటీల్లో మండలంలోని పెదబోదిగల్లం హైస్కూల్ బాలిక ప్రతిభ చూపింది. సీనియర్స్ విభాగ పద్యపఠనం పోటీల్లో 8వ తరగతి చదువుతున్న జెరీనా కౌసర్ జిల్లా స్థాయిలో ప్రథమస్థానం సాధించినట్టు తెలుగు ఉపాధ్యాయుడు ఎన్‌వీఎస్ ఆచార్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో శనివారం హెచ్‌ఎం చోడిశెట్టి సత్యనారాయణ, సర్పంచ్ మున్నీషాబేగం, ఉపాధ్యాయులు ఫల్గుణరావు, ఆచార్యులు, కుమారి, చిన్నారావు, శ్రీదేవి, రమేశ్‌బాబు అభినందించారు.

గిరిజన పథకాలపై అవగాహన



అంగన్‌వాడీ స్టాల్ పరిశీలిస్తున్న అధికారులు

నక్కపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీడిక గిరిజన గ్రామంలో శనివారం ధర్తి ఆబ జన జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు.ఎంపీడీవో సీతారామరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 17 శాఖల ద్వారా గిరిజనులకు విజన్ నుంచి మిషన్‌కు అనే నినాదంతో పంచాయతీల్లో స్థాయిలో సకల సదుపాయాలు కల్పించాలని నిర్ణయించిందన్నారు. గిరిజన సంక్షేమ అధికారిణి ఈ నాగ శిరీషా మాట్లాడారు. గ్రామంలో మొక్కలు నాటారు. అంగన్‌వాడీ కార్యకర్తలు స్టాల్స్ ఏర్పాటు చేశారు.ఈవోఆర్‌డీ మజ్జి శ్రీను, ఐసీడీఎస్, వెలుగు, ఉపాధి అధికారులున్నారు.

మృతుని కుంటుంబానికి సాయం

ఎస్. రాయవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన కోనవానిపాలెంలోని కొర్ని శ్రీను కుటుంబానికి జనసేన పార్టీకి చెందిన గోళ్ళ సరేశ్ సాయం అందించారు. శనివారం తన తండ్రి సత్యారావు చేతుల మీదుగా కూటమి నాయకుల సమక్షంలో రూ. ఐదు వేలతో పాటు నిత్యావసర సరుకులను మృతుని కుటుంబ సభ్యులకు అందజేసారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు కోన అప్పలరాజు, మామిడి నాగరాజు, సేనాపతి బాబూరావు, వంగలపూడి నానాజీ, కోన దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

ఎలమంచిలి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి నాగేంద్ర కాలనీలోని కామాక్షి అమ్మవారి ఆలయ ఆవరణలో శనివారం వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ నెల 8 నుంచి 16వ తేదీ వరకు ప్రతి రోజూ ఆలయ ఆవరణలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం వందలాది మంది భక్తుల సమక్షంలో గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎలమంచిలి విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు ఆవుపాటి సుబ్బారావు, సున్నం నాగేశ్వరావు, అలుగోలు కొండబాబు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల అనుపోత్సవం



నిమజ్జనం కార్యక్రమంలో భక్తులను ఆకట్టుకున్న కోయి డ్యాన్సులు

రాంబిల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొట్టుబోలు గ్రామంలో శనివారం సాయంత్రం గౌరీపరమేశ్వరుల అనుపు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సమీప గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో గౌరవీపరమేశ్వరుల అమ్మవారిని దర్శించుకుని, పసుపు, కుంకుమలను నివేదించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం గౌరీపరమేశ్వరుల ప్రతిమలను పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు, కోయి డాన్సులు, ప్రత్యేక భజనలు, కోలాటాల నడుమ పురవీధుల్లో ఊరేగించి సమీప శారదా నదిలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

తీరానికి కొట్టుకువస్తున్న చనిపోయిన చేపలు

అచ్యుతాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పూడిమడక తీరంలో చనిపోయిన చేపలు చేరుతున్నాయి. శుక్రవారం రెండు మృత తాబేళ్లతో పాటు చనిపోయిన చేపలు తీరానికి కొట్టుకువచ్చాయి. శనివారం కూడా పూడిమడక తీరంలో చనిపోయిన చేపలు కొట్టుకు వచ్చాయి. దీంతో మత్స్యకారులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. సెజ్‌లోని కర్మాగారాల నుంచి విడుదలైన వ్యర్థాలే చేపలు చనిపోవటానికి కారణమని మత్స్యకారులు అంటున్నారు. పొల్యూషన్ కంట్రోల్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యమన్నారు. ఇటీవలే ఈ రెండు శాఖలకు చెందిన అధికారులు పూడిమడక వచ్చి నీటి నమూనాలను సేకరించారు. నివేదిక రాక ముందే ప్రతీ రోజు మత్స్య సంపద నాశనమవుతున్నదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రంథాలయాలను కాపాడుకోవాలి

మునగపాక, నవంబర్ 16 (ఆంధ్రజ్యోతి): విజ్ఞానాన్ని అందిస్తున్న గ్రంథాలయాలను కాపాడుకోవడం అందరి బాధ్యత అని గ్రంథాలయాధికారి ఎల్.వి.రమణ పిలుపునిచ్చారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శనివారం రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా గ్రంథాలయ ఉద్యమ స్ఫూర్తిప్రదాతులు అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల హరి సర్వోత్తమరావు, పాతూరి నాగభూషణం, ఎస్.ఆర్.రంగనాథన్ తదితరులు చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాల కోసం వారు చేపట్టిన ఉద్యమాలు, త్యాగాలు గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

▸ ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

రాంబిల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత సమాజంలో అందరపైన ఉందని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. మండలంలోని కొత్తూరు గ్రామంలో శనివారం బాలల హక్కుల వారోత్సవాల పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల హక్కులు కాపాడుతూ సమాజ ప్రయోజకులుగా తీర్చిదిద్దడంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దేశ సౌభాగ్యం ఉత్తమ బాలల నిర్మాణంతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు జనపరెడ్డి శ్రీనివాసరావు, బి.వి.రమణ, క్రియేటివ్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి మల్ల నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు సోదరుడు మృతిపై దిగ్భ్రాంతి

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోదరుడు, మాజీ ఎమ్మెల్యే నారా రామూర్తినాయుడు మృతిపై ఎమ్మెల్యే విజయకుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రామూర్తినాయుడు పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన పేర్కొన్నారు.

ఎంజేపురంలో వింత ఆచారం

మూడు నెలలకు వినాయకుడి అనుపు

అచ్యుతాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎంజేపురంలో వినాయక నిమజ్జనం శనివారం ఘనంగా జరిగింది. సాధారణంగా వినాయకుడిని నవరాత్రుల అనంతరం నిమజ్జనం చేస్తారు. ఈ గ్రామంలో మూడు నెలల పాటు గ్రామంలో ఉంచుతారు. కార్తీక పౌర్ణమి అనంతరం వచ్చే శనివారం నిమజ్జనం చేస్తారు. ఇదిలా ఉండగా ఇక్కడ వినాయక నిమజ్జనానికి గ్రామస్థులు పోటీ పడటం విశేషం. ఈ క్రమంలో బాణసంచా కాలుస్తారు. తద్వారా వినాయకుని ఊరేగింపు శనివారం రాత్రంతా జరుగుతుంది. ఆదివారం ఉదయానికి నిమజ్జనం పూర్తవుతుంది. ఈ కార్యక్రమానికి మునగపాక, రాంబిల్లి మండలాల నుంచి కూడా భక్తులు తరలివస్తారు.

'నిర్వాసితులకు న్యాయం చేయాలి'



ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న ప్రజా సంఘాల ప్రతినిధులు

అచ్యుతాపురం, నవంబరు 16 (ఆన్‌లైన్): అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు విస్తరణ నిర్వాసితులకు తగిన న్యాయం చేయాలంటూ ప్రజా సంఘాల ప్రతినిధులు ఆర్డీవోకు శనివారం వినతిపత్రాన్ని ఇచ్చారు. భూసేకరణ సక్రమంగా జరగలేదని, వారి పేర్లు కొన్ని జాబితాలో లేవు, కొన్ని తప్పులు దొర్లాయి. అన్నీ సరిచేసి తుది జాబితా విడుదల చేయాలన్నారు. రోడ్డు పక్కన చిరు వ్యాపారులను గుర్తించి, వారికి కూడా పరిహారం ఇవ్వాలన్నారు. వారి వెంట రైతు సంఘం జిల్లా కార్యదర్శి కర్రి అప్పారావు, జిల్లా కౌలు రైతు సంఘం కార్యదర్శి కె.రామసదాశివ రాజు, సీఐటీయూ నాయకులు బ్రహ్మాజీ, బుద్ద రంగారావు, ఎస్.కన్నుంనాయుడు, రాము ఉన్నారు.

చురుగ్గా రహదారుల నిర్మాణం

మునగపాక, నవంబర్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో సిమెంట్ రోడ్లు నిర్మాణం జోరుగా కొనసాగుతోందని టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని రాజుపేట, గవర్ల అనకాపల్లి గ్రామాల్లో శనివారం సీసీ రోడ్లు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రోడ్లు వేయడంలో పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

▸ ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకటపతిరాజు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటపతిరాజు

ఎలమంచిలి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటపతిరాజు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఉషోదయా కళాశాల ఆవరణలో శనివారం నిర్వహించిన జోనల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల ప్రధాన సమస్య 117 రద్దు చేయాలన్నారు. అలాగే మధ్యంతర భృతి ప్రకటించాలని, తెలుగు, ఆంగ్ల మాధ్యమం బోధన జరపడానికి అవకాశం కల్పించాలని విన్నవించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మారావు మాట్లాడుతూ ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మాజీ అధ్యక్షుడు ఎన్‌వీ.సూర్యనారాయణ, రాష్ట్ర సబ్ కమిటీ సభ్యులు కె.శ్రీనివాసరావు, పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్‌రాయవరం, రాంబిల్లి మండలాల నాయకులు పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపు



సారెను ఊరేగింపుగా తీసుకు వెళ్తున్న భక్తులు

ఎలమంచిలి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని సోమలింగపాలెంలో శనివారం రాత్రి గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ప్రతీ ఇంటి నుంచి వివిధ రకాలతో పిండి వంటలతో మహిళలు గ్రామంలోని వీధుల్లో గౌరీపరమేశ్వరుల నామస్మరణ చేసుకుంటూ సారె ఊరేగింపును నిర్వహించారు. అనంతరం ఆలయానికి చేరుకుని ప్రత్యేకంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గోపి, ఝాన్సీ, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

నెహ్రూనగర్‌లో 'స్వచ్ఛతా హి సేవ'

ఎలమంచిలి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని నెహ్రూనగర్ ప్రాంతంలో మునిసిపల్ అధికారులు, సిబ్బంది శనివారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్కు పరిసరాల్లో ఉన్న తుప్పలను తొలగించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు, టిపివో శ్రీలక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు పారిశుధ్య కార్మికులు, సచివాలయ సిబ్బందితో పరిసరాలను పరిశుభ్రంగా చేయించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు నేత నక్కాశివ శంకర్, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకన్న సన్నిధిలో ప్రగడ



ఎలమంచిలి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతి వేంకటేశ్వరస్వామిని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరావు శనివారం దర్శించుకున్నారు. రాష్ట్రం సంక్షేమంతో పాటు శాంతితో వర్ధిల్లాలని స్వామివారిని వేడుకున్నట్టు ఈ సందర్భంగా ఆయన చెప్పారు.

కొక్కిరాపల్లిలో ఎట్టకేలకు తీరిన లోఓల్టేజీ సమస్య

ఎలమంచిలి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని కొక్కిరాపల్లి వార్డు దళిత కాలనీలో కొన్ని నెలలుగా వేధిస్తున్న లోవోల్టేజీ సమస్యను పరిష్కరించినట్టు కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ తెలిపారు. ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా ఈపీడీసీఎల్ ఏఈ కనకరాజు స్పందించి శనివారం నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారని, దీంతో ప్రజల ఇబ్బందులు తీరాయని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

ఘనంగా జాతీయ పత్రికా దినోత్సవం

ఎలమంచిలి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రం ఎలమంచిలిలో శనివారం జాతీయ పత్రికా దినోత్సవాన్ని శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఏపీయూడబ్ల్యూజే ఎలమంచిలి నియోజకవర్గ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక విలేకరులు ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ జంక్షన్ నుంచి ప్రధాన రోడ్డు మీదుగా జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలి అనే నినాదాలతో ర్యాలీ సాగించారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధి ఆడారి గంగాధర్, విలేకరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యమ నేతలకు నివాళి

ఎలమంచిలి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయ ఉద్యమ నేతల చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఉద్యమ నేతలు అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్ఆర్.రంగనాథన్ చిత్రపటాలకు విశ్రాంత అధ్యాపకులు ఎ.సన్యాసిబాబు, ఎ.పూరిజగన్నాథం పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఆనంద్, వీడీ దుర్గారావు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

అచ్యుతాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయం వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక గ్రంథాలయంలో శనివారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థి దశలోనే పుస్తక పఠనం అలవర్చుకోవాలని ఈ సందర్భంగా ప్రభుత్వ ఉపాధ్యాయుడు వెంకట అప్పారావు సూచించారు. నెలకొక పుస్తకాన్ని ఎంచుకొని అధ్యయనం చేస్తే విజ్ఞానం పెరగడంతో పాటు జ్ఞాపకశక్తి కూడా పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు అభయాంజనేయస్వామి తీర్థ మహోత్సవం

రాంబిల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వాడనర్సాపురంలో అభయాంజనేయస్వామి తీర్థ మహోత్సవం ఆదివారం జరగనుంది. ఇందుకోసం మత్స్యకార పెద్దలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా మండల స్థాయి షటిల్ బ్యాడ్మింటన్, ప్రత్యేక భజన పిడతలు పోటీలు ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

తాడి, మూలస్వయంభూవరం గ్రామాలను తరలించాలి

»» అసెంబ్లీలో ఎమ్మెల్యే పంచకర్ల విజ్ఞప్తి



పరవాడ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఫార్మా సిటీ, సింహాద్రి ఎన్టీపీసీ కాలుష్యం బారి నుంచి తాడి, మూలస్వయంభూవరం గ్రామాల ప్రజలను కాపాడేందుకు ఆయా గ్రామాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు విజ్ఞప్తి చేశారు. శనివారం అసెంబ్లీ సమావేశాల్లో ఆయన పరవాడ ప్రాంతంలో నెలకొన్న కాలుష్య సమస్యపై తన గళాన్ని వినిపించారు. ఫార్మా యాజమాన్యాల వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా బహిరంగ ప్రదేశాల్లోకి విడిచిపెడుతోందని, దీని కారణంగా భూగర్భ జలాలు కలుషితమవుతాయన్నారు. హిందూజా పవర్ ప్లాంట్‌కు బొగ్గు తరలిస్తున్న లారీలతోపాటు సింహాద్రి ఎన్టీపీసీ నుంచి ఫ్లైయాష్ తీసుకెళ్తున్న లారీల కారణంగా పరవాడ, పరిసర ప్రాంతాల ప్రజలు కాలుష్యానికి గురవుతున్నారన్నారు. కాలుష్యం బూతం నుంచి ప్రజలను కాపాడాలని అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయిబాబా జయంతి



సత్యసాయిబాబా చిత్రపటానికి పూజలు చేస్తున్న రత్నాకర్

అనకాపల్లి టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక గవరపాలెం నిదానందొడ్డిలోని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సత్యసాయిబాబా 99వ జయంతి వేడుకలు శనివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ హాజరై కలశ స్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. సత్యసాయిబాబా చిత్రపటానికి పూజలు చేసి, పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సమితి ప్రతినిధులు దాడి రత్నాకర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మళ్ల సత్యసాయి, కె.ఉమామహేశ్వరరావు, మళ్ల స్వామి, కోడూరు త్రినాథ్, మళ్ల బాలు, ఎం. గౌతం, మళ్ల దీపక్, దాడి త్రినాథ్, మళ్ల రామకృష్ణ, విల్లూరి పానీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ బాధితులకు న్యాయం చేయాలి

»» ఆర్డీవోకు ప్రజా సంఘాల నాయకుల వినతి



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న ప్రజా సంఘాల నేతలు

అనకాపల్లి టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు విస్తరణ బాధితుల సమస్యలను పరిష్కరించాలని శనివారం ఆర్డీఓ షేక్ ఆయీషాకు ప్రజా సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. రోడ్డుకి ఇరువైపులా ఇళ్లు, దుకాణాలు, భూములు కోల్పోతున్న నిర్వాసితుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరారు. భూములు కోల్పోతున్నా జాబితాలో తప్పులున్నాయని, వాటిని సరిచేసి తుది జాబితా ప్రకటించాలని కోరారు. ఆర్అండ్‌బీ అధికారులు తుది జాబితా ఇప్పటికీ ప్రకటించలేదన్నారు. ఆర్డీవోను కలిసిన వారిలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. రామసదాశివరావు, కార్యదర్శి కర్రి అప్పారావు, సీఐటీయూ మునగపాక మండల కార్యదర్శి కె.బ్రహ్మాజీ, ఎస్ఈజడ్ నిర్వాసిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు రంగారావు పాల్గొన్నారు.

పోలీసు సంక్షేమ సొసైటీ నగదు పంపిణీ



పోలీసు సంక్షేమ సొసైటీ చెక్కులను అందజేస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లిరూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పోలీసు సంక్షేమ కో-ఆపరేటివ్ సొసైటీలో దాచుకున్న నగదును సభ్యులకు అందిస్తున్నట్టు ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. శనివారం పోలీసు సంక్షేమ కో-ఆపరేటివ్ సొసైటీలో సభ్యులుగా ఉన్నవారికి నగదును అందజేశారు. ఏఆర్. హెచ్‌సీ శ్రీరామ్మూర్తికి రూ.1,72,900, ఏఆర్.హెచ్‌సీ శ్రీనివాసరావుకు రూ.1,44,200, ఏఎస్ఐ చిన్నయ్య మరణానంతరం అతని భార్య మచ్చమ్మకు డెత్ రిలీఫ్ ఫండ్‌తో కలిపి రూ.2,05,500, వ్యక్తిగత అవసరాల నిమిత్తం సభ్యత్వం విరమించుకున్న హెచ్‌సీ విక్టర్ బాబు రూ.1,38,500 చెక్కులను ఎస్పీ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ దేవప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కల్పించాలని సీపీఎం ప్రచారం



తుమ్మపాల సంతలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొత్తూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లిలో ఎటువంటి ఉపాధి అవకాశాలు పెరగలేదని, తక్షణమే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సీపీఎం నేతలు శనివారం ప్రచారం చేశారు. మండలంలోని తుమ్మపాల, పెరుగుబజారు, చిన్నవీధి తదితర ప్రాంతాల్లో సీపీఎం నేతలు గంటా శ్రీరామ్, బి. ఉమామహేశ్వరరావు, కె.తేలయ్యబాబు, గండినాయిన బాబు, జి. సుభాషిణి, బుగడి నూకఅప్పారావు ప్రచారం చేశారు. బెల్లం మార్కెట్ రోజు రోజుకీ కుచించుకుపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తుమ్మపాల చక్కెర కర్మాగారం మూతపడిందని, కొత్తగా ఎటువంటి కంపెనీలు రాలేదన్నారు. ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు ఈ నెల 18 నుంచి అనకాపల్లి ఆర్డీవో కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. అనంతరం కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జాతీయ జూడో కరాటే పోటీలకు డిగ్రీ విద్యార్థి ఎంపిక



శీలంశెట్టి మధు

సబ్బవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జార్ఖండ్ రాజధాని రాంచీలో డిసెంబర్ నెలలో జరగనున్న జాతీయ జూడో కరాటే పోటీలకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో విద్యార్థి శీలంశెట్టి మధు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సీతాలక్ష్మి తెలిపారు. ఆంధ్రా విశ్వవిద్యాలయం అంతర కళాశాలలో జరిగిన జూడో కరాటే (60 కేజీల విభాగం) పోటీల్లో మధు ప్రథమ స్థానం సాధించాడన్నారు. రాంచీలో జరిగే జాతీయ పోటీల్లో ఆంధ్రా యూనివర్సిటీ తరఫున పాల్గొంటాడని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి మధును శనివారం ప్రిన్సిపాల్, సిబ్బంది డాక్టర్ వీవీ గోపాలకృష్ణ, ఎంవీ రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ ఎల్. గణేష్ అభినందించారు.

కూరగాయల మార్కెట్‌లో రాజ్యమేలుతున్న సమస్యలు

- నడక మార్గంలోనే దుకాణాలు
- రాకపోకలకు కొనుగోలుదారుల అవస్థలు
- టాయిలెట్లు లేక మహిళల ఇక్కట్లు



రద్దీగా ఉన్న కూరగాయల మార్కెట్

అనకాపల్లి టౌన్, నవంబరు 16: పట్టణ నడిబొడ్డున ఉన్న కూరగాయల మార్కెట్‌లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. మార్కెట్‌లో ఒక లైన్‌లో దుకాణాలు ఏర్పాటు చేయకుండా నడక మార్గంలో పెట్టడంతో ఇరుకుగా మారింది. దీంతో కొనుగోలుదారులు ఇక్కట్లు పడుతున్నారు. మార్కెట్ ప్రధాన మార్గంలో కూడా రోడ్డుకు ఇరువైపులా వ్యాపారాలు చేయడంతో నిత్యం రద్దీగా ఉంటోంది.

అనకాపల్లి మార్కెట్‌కు చుట్టుపక్కల మండలాల రైతులు కూరగాయలను అర్ధరాత్రి దాటిన తరువాత తీసుకువస్తారు. తెల్లవారే లోపు తెచ్చిన కూరగాయలను చిల్లర వర్తకులకు విక్రయించి వెళ్లిపోతున్నారు. అయితే మార్కెట్‌కు వచ్చే రైతులకు గాని, చిరు వ్యాపారులకు గాని కనీస సౌకర్యాలు లేవు. కనీసం టాయిలెట్ సౌకర్యం కూడా లేకపోవడంతో తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. గత టీడీపీ హయాంలో అప్పటి ఎంపీ, ఎమ్మెల్యేల నిధులతో మార్కెట్‌లో సిమెంట్ రోడ్లు వేసి, చిల్లర వర్తకుల కోసం షెడ్లు నిర్మించారు. అయితే కొందరు ఆ షెడ్లల్లో వ్యాపారాలు చేయకుండా ముందు కూడా దుకాణాలు వేయడం వల్ల కొనుగోలుదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రి వేళల్లో అరకొర వీధి దీపాలు వెలుగుతున్నాయి. హైమాస్ట్ లైట్లు వేయాలనే డిమాండ్ ఉన్నప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ఆశీల రూపంలో జీవీఎంసీకి ఆదాయం చెల్లిస్తున్నా అందుకు తగ్గ కనీస సౌకర్యాలు కల్పించడం లేదని చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో టాయిలెట్స్ ఏర్పాటు చేసి జీవీఎంసీయే నిర్వహణ బాధ్యత తీసుకోవాలని చిరు వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు. మార్కెట్‌లో దుకాణాల నిర్వహణకు స్థల సమస్య చోటుచేసుకోవడంతో పలువురు చిల్లర వర్తకులు బండిగాడివీధిలోని రోడ్డుపైనే అమ్మకాలు సాగిస్తున్నారు. ఈ కారణంగా ఉదయం వేళల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్నది. టీడీపీ హయాంలో మార్కెట్‌లో డ్రైనేజి వ్యవస్థను ఏర్పాటు చేసినప్పటికీ నిర్వహణ లోపం కారణంగా అవి పూడికపోయాయి. దీంతో మార్కెట్‌లో దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాలు పడితే కాలువల్లో ప్రవహించాల్సిన మురికినీరు రోడ్ల పైన దుకాణాల ముందుకు వచ్చేస్తుందని చిరు వ్యాపారులు పేర్కొంటున్నారు. జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీస్ అధికారులు మార్కెట్‌లో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



నడక మార్గంలో బయట పెట్టిన కూరగాయలు

మార్కెట్‌లో కనీస సౌకర్యాలు లేవు..



చిల్లర వర్తకులుగా ఎక్కువ మంది మహిళలు ఉన్నారు. వారికి టాయిలెట్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. కనీసం మంచినీటి సౌకర్యం లేక మార్కెట్‌కు వచ్చేటప్పుడు ఇంటి నుంచి తాగునీటిని తీసుకువస్తున్నాం. కాలువలను మెరుగుపరిచి పరిశుభ్రతకు అవకాశమివ్వాలి. అధికారులు చొరవ చూపాలి.

దాడి వెంకటలక్ష్మి, చిల్లర వర్తకుల సంఘం అధ్యక్షురాలు

మోటారు కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ధర్నా



ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

అనకాపల్లి టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మోటారు కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు వైఎన్ భద్రం మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు విపరీతంగా పెరిగి ఆటోలు, మోటారు వాహనాలు నడపలేని పరిస్థితుల్లో దుర్భర జీవితం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రోడ్లు శిథిలావస్థలో ఉండడంతో వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని, మరో పక్క ఆర్టీవో, పోలీసులు ఈ-చలానా పేరుతో కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతోపాటు డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్ ధరలు తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ఆటో డ్రైవర్లకు హాని చేసే జీవో నంబరు 21, 31లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ ఏఓకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కె. త్రినాథ్, కోరిబిల్లి శంకరరావు, కొలుసు రాంబాబు, ఎం. దేముళ్లు, పెదిరెడ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

అనకాపల్లి టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు గ్రంథాలయాలు-విద్యార్థుల విజ్ఞాన వీచికలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రోగ్రామ్ అధికారి బల్లా నాగభూషణం మాట్లాడుతూ గ్రంథాలయాల్లో విద్యార్థులకు సంబంధించిన అన్ని పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జీఎల్ఎన్ శాస్త్రి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పరవాడలో..

గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం పరవాడ శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పర్యావరణం-పరిశుభ్రత, కాలుష్యం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు వారోత్సవాల ముగింపు రోజున బహుమతులు అందజేస్తామని గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ కె.వి. లక్ష్మణరావు తెలిపారు. వ్యాసరచన పోటీలకు న్యాయ నిర్ణేతలుగా జంగాల నాగేశ్వరరావు, కాండ్రేగుల వెంకట రామారావు వ్యవహరించారు.

సబ్బవరంలో..

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక శాఖ గ్రంథాలయంలో పలు పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, చెస్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. గ్రంథాలయాధికారి వి శిరీషా ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో జూనియర్ కళాశాల అధ్యాపకులు ప్రసాద్, రామారావు క్విజ్ మాస్టర్లుగా వ్యవహరించారు. ఉపాధ్యాయులు జోత్స్న, మనోజ్ పాల్గొన్నారు.

కొత్తూరులో..

గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక భారత వికాస పరిషత్ అనకాపల్లి శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు 'గ్రంథాలయాలు-వాటి ఉపయోగాలు' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 32 విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజు, ఓం.రాము, శివరాము, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రూ. కోటితో సీసీ రోడ్లు, కాలువలు



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు

సబ్బవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సబ్బవరం మేజరు పంచాయితీలో రూ. కోటిలతో సీసీ రోడ్లు, కాలువల పనులు చేపట్టినట్టు సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు తెలిపారు. శనివారం స్థానిక సాయినగర్ కాలనీలో రూ.3.5 లక్షలతో చేపట్టిని సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సాయినగర్, జంగాలకాలనీ, గంగిరెడ్ల కాలనీ, పెదగరువు, గొర్లివానిపాలెం, ఆదిరెడ్డిపాలెం, పెదనాయుడుపాలెం, గోపాల్‌నగర్, చినగొల్లలపాలెం తదితర శివారు గ్రామాల్లో అభివృద్ధి పనులు చురుకుగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు బైలపూడి దేముడు, చైతన్య, వార్డు సభ్యులు టి. శేఖర్, పల్ల కృష్ణ, చిత్రాడ శ్రీను, కొల్లి కృష్ణ, జెట్టి ప్రసాద్, గుడ్ల నాని పాల్గొన్నారు.

చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో పాల్గొనవద్దు : సీఐ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ స్వామినాయుడు

కశింకోట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): చట్టవిరుద్ధమైన గంజాయి, స్మగ్లింగ్ వంటి కార్యకలాపాల్లో పాల్గొని విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సీఐ అల్లు స్వామినాయుడు అన్నారు. శనివారం స్థానిక విశ్వభారతి జూనియర్ కళాశాలలో నిర్వహించిన సంకల్పం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అక్రమ రవాణా, ఆన్‌లైన్ మోసాలు తదితర వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ మోసాలు, ఆన్‌లైన్ మోసాల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకొని అందరికీ అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మనోజ్‌కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎంపీడీవో



తేగాడలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో రవికుమార్

కశింకోట, నవంబరు 16 (ఆంధ్రజోతి) : మండలంలోని వెదురుపర్తి, సత్తెమ్మతల్లి కాలనీ, కొత్తపల్లి, తేగాడ తదితర పంచాయతీల్లో పల్లె పండుగ కార్యక్రమాల్లో మంజూరు చేసిన పనులను ఎంపీడీవో రవికుమార్ శనివారం పరిశీలించారు. వెదురుపర్తిలో సీసీ రోడ్డు, గోకుం షెడ్డు, కశింకోట సత్తెమ్మతల్లి కాలనీలో సీసీ రోడ్డు, కొత్తపల్లిలో గోకులం షెడ్డు, తేగాడలో సీసీ రోడ్డును పరిశీలించి అక్కడ ఉన్న ఇంజనీరింగ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శ్రీనివాస్, ఏపీవో ఎం.శ్రీనివాసరావు, టెక్నికల్ సిబ్బంది శివాని, కుమారి, సత్యనారాయణ పాల్గొన్నారు.

108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కశింకోట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆపదలో ఉన్న ప్రజల ప్రాణాలను కాపాడుతున్న 108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని 108 కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్ నేతలు అప్పికొండ రామకృష్ణ, ఆర్.శివ, ఈ.ఎం.టీ ఎస్. చంద్రమౌళి అన్నారు. శనివారం తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావును కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 108 ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని లేకుంటే ఈ నెల 25 నుంచి 108 సేవలు బంద్ చేస్తామని హెచ్చరించారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

విద్యుత్ భారం మోపడం తగదు

»» సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

కొత్తూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారులపై కోట్లాది రూపాయల భారం మోపడం తగదని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తూర్పు, మధ్య, దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థలు 2023-24లో ట్రూ అప్ చార్జీల ప్రతిపాదనలపై ఈనెల 4న బహిరంగ నోటిఫికేషన్ విడుదల చేసి అభ్యంతరాలను, అభిప్రాయాలకు కోరిందన్నారు. ఈ ప్రతిపాదనల వల్ల విద్యుత్ వినియోగదారులపై రూ.11,820 కోట్లు భారం పడుతుందన్నారు. 2023-24లో వినియోగించుకున్న విద్యుత్‌పై యూనిట్‌కు ప్రతి నెలా అదనంగా రూ.50పైసల నుంచి రూ.2.50 పైసలు వరకు భారం పడుతుందన్నారు. నెల రోజు క్రితం రూ.6,072 కోట్లు భారం వేసి, మరలా దానికి దాదాపు రెట్టింపు భారం మోపడం అన్యాయమన్నారు. వ్యవసాయ పంపు సెట్లకు, గృహ వినియోగదారులు, వ్యాపార, పరిశ్రమలు, సంస్థలకు స్మార్ట్ మీటర్లు బిగించకుండా ఆదేశాలివ్వాలని కోరారు. 2023-24లో చార్జీల ప్రతిపాదనలపై అభ్యంతరాలకు గడువు 15 రోజు పొడిగించాలని డిమాండ్ చేశారు. అలాగే దీనిపై బహిరంగ విచారణ జరిపి ప్రజాభిప్రాయాన్ని స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా జాతీయ పత్రికా దినోత్సవం



రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న వైద్యులు, జర్నలిస్టులు

అనకాపల్లి టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జాతీయ పత్రికా దినోత్సవాన్ని శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఏపీయూడబ్ల్యూజే అనుబంధ శాఖ అనకాపల్లి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వైద్యాలయంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాలయం వైద్యులు శోభాదేవి, అశోక్‌కుమార్, అనకాపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మళ్ల భాస్కరరావు,ఎలక్ట్రానిక్ మీడియా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు అవతారం, భీమరశెట్టి నూకేష్, కార్యవర్గసభ్యులు కిరణ్‌కుమార్, మణికుమార్, వై. జనార్ధన్, ఎన్.శ్రీను, బి. కృష్ణ పాల్గొన్నారు.

టిడ్కో గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

»» జీవీఎంసీ ఏపీడీకి నివాసితుల వినతి



ఏపీడీకి వినతిపత్రం ఇస్తున్న నివాసితులు

అనకాపల్లి టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సత్యనారాయణపురం టిడ్కో గృహాల సముదాయంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని నివాసితులు శనివారం జీవీఎంసీ జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏపీడీ సంతోష్‌కుమార్‌కు ఎన్టీఆర్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ (టిడ్కో) అధ్యక్ష, కార్యదర్శులు పీఎస్ఎన్ హుస్సేన్, ప్రసాద్, నివాసితులు వినతిపత్రం అందజేశారు. వీధి దీపాలు, సరైన రోడ్డు సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, తుప్పలు పెరిగిపోవడంతో విషసర్పాల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. వర్షాలు కురిస్తే మూడో ఫ్లోర్ శ్లాబుల్లోంచి నీరు కారుతోందని వివరించారు. తక్షణమే మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్య క్రమంలో జి. వెంకటలక్ష్మి, ఏ. రమణమ్మ, కృష్ణ, పట్నాల వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పగలే.. వెలుగులు



పైడిమాంబ ఆలయం ముఖద్వారం వద్ద వెలుగుతున్న ఎల్ఈడీ లైట్లు

పరవాడ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గాజువాక- ఎలమంచిలి ప్రధాన మార్గంలోని పరవాడ పైడిమాంబ ఆలయ ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన ఎల్ఈడీ లైట్లు పగలే వెలుగుతున్నాయి. కొంతకాలంగా ఇలా వెలుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.విద్యుత్‌శాఖ అధికారుల తీరుపై స్థానికులు మండిపడుతున్నారు. పగటి వెలుగులకు అడ్డుకట్టవేయాలని కోరుతున్నారు.

ఘనంగా అన్న సమారాధన



గౌరీ పరమేశ్వర్లను దర్శించుకుంటున్న రవికుమార్, తదితరులు

సబ్బవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని గొటివాడ శివారు బొందావానిపాలెంలో గౌరీపరమేశ్వర్ల మండపం వద్ద శనివారం అన్న సమారాధన నిర్వహించారు. నియోజకవర్గ వైసీపీ నాయకులు గండి రవికుమార్ గౌరీ పరమేశ్వర్లను దర్శించుకొని, అనంతరం అన్నసమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు జి. దుర్గాప్రసాద్, విరోతి రామారావు, లగిశెట్టి కుమార్, సాలాపు సత్యారావు, సిరపరు వాసు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

సబ్బవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆరిపాక సర్వే నంబరు 84 ప్రభుత్వ భూమిలో తహసీల్దార్ బి. చిన్నికృష్ణ ఆదేశాల మేరకు వీఆర్వో అప్పలరాజు, వీఆర్ఏ నర్సింగరావు శనివారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. సర్వే నంబరు 84 ప్రభుత్వ భూమి అని, హెచ్చరిక బోర్డును తొలగించినవారిపై ల్యాండ్ గ్రాబింగ్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ప్రమాదాల పట్ల కార్మికులకు అవగాహన ఉండాలి

పరవాడ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవిస్తే నివారించడానికి కార్మికులకు అవగాహన కలిగి ఉండాలని జాతీయ విపత్తు స్పందన దళం 10 బెటాలిన్ ఇన్‌స్పెక్టర్ వై. సత్యనాయణ పేర్కొన్నారు. స్థానిక ఐవోసీ బాట్లింగ్ పరిశ్రమ, సువెన్ ఫార్మా పరిశ్రమల్లో కార్మికులకు శనివారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రమాదాలు జరగకుండా భద్రతా ప్రమాణాలు పాటించడం కార్మికుల తొలి కర్తవ్యంగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.



చింతాలమ్మఘాట్ పై మలుపులో 30 అడుగుల మేర తవ్విన కొండ



ఘాట్ పై నుంచి రెండవ మలుపులో జారుతున్న రాళ్లు, మట్టి

కొండ జారితే.. గుండె చెరువే..!

- జాతీయ రహదారి 516 -ఈ నిర్మాణ పనుల్లో లోపాలు
- చింతాలమ్మఘాట్ రోడ్డులో కానరాని రక్షణ చర్యలు
- మట్టి చరియలు, బండరాళ్లు జారిపడే ప్రమాదం

కొయ్యూరు, నవంబరు 16: ఆంధ్రజ్యోతి: గతంతో పోలిస్తే చింతాలమ్మఘాట్‌లో ప్రయాణం వాహన చోదకులకు ఉల్లాసాన్ని కలిగించేలా కనిపిస్తున్నా జాతీయ రహదారి 516-ఈ నిర్మాణానికి వీలుగా మలుపుల్లో కొండలను దొలిచి వదిలేయడంతో ప్రమాదాల భయం పొంచి ఉంది. రోడ్డు విస్తరణకు కొండలు దొలిచిన ప్రాంతాల్లో రక్షణ ఏర్పాట్లు పూర్తి స్థాయిలో కల్పించకపోవడంతో ప్రయాణికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. రాజమహేంద్రవరం నుంచి పాడేరును కలుపుతూ అరకు మీదుగా విజయనగరం కలిపే జాతీయ రహదారి 516 ఈ నిర్మాణాలు మండల పరిధిలో దాదాపు చివరిదశకు చేరాయి. ఇందులో భాగంగా చింతాలమ్మఘాట్‌లో ఏడొంపుల ఘాట్ విస్తరణ పనులు పూర్తికావచ్చాయి. పలుచోట్ల రహదారి విస్తరణకు వీలుగా కొండను దొలిచి నిర్మాణాలు చేపట్టారు. ఈ మేరకు భవిష్యత్తులో దొలిచిన కొండవాలుల నుంచి బండరాళ్లు, మట్టి జారి పోకుండా సిమెంట్ ఐరన్‌తో కూడిన గోడలను కొన్ని ప్రదేశాలలో నిర్మించారు. అయితే, కొయ్యూరు నుంచి కృష్ణాదేవిపేట వెళ్లే ఘాట్‌రోడ్డు మొదటి మలుపు వద్ద రహదారి విస్తరణకు వీలుగా సుమారు 30 అడుగుల ఎత్తు నుంచి పెద్ద బండరాళ్లను పేల్చి మట్టిని తొలగించారు. అలాగే, ఎస్ ఆకార మలుపు వద్ద కొండను పిండి చేశారు. ఘాట్ మధ్యలో మరో చోట 15 అడుగుల మేర మట్టిని తొలగించారు. కృష్ణాదేవిపేట నుంచి కొయ్యూరు వెళ్లే ఘాట్‌రోడ్డు ప్రారంభం రెండో మలుపు వద్ద 30 అడుగులకు పైగా మట్టిని తొలగించి రహదారి నిర్మించారు. వాస్తవానికి ఈ ప్రదేశాలు ప్రమాదకరమైనవి. వర్షం కురిస్తే మట్టి కరిగి బండరాళ్లు కిందపడే ప్రమాదం ఉంది. ఇలాంటి ప్రదేశాలలోరక్షణ గోడలు లేవు. కనీసం మట్టి, రాళ్లు దొర్లి కింద పడే అవకాశం లేకుండా దొలిచిన కొండ ప్రాప్తికి ఇనుప చిక్కాలైన ఏర్పాటు చేయలేదు. దీంతో వర్షం కురిస్తే వాహన చోదకులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణాలు సాగిస్తున్నారు. కొండచరియలు విరిగి పడి ఏప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడే ఈ పరిస్థితి ఇలా ఉంటే భవిష్యత్తులో మరింత సమస్యాత్మకంగా మారుతుందని భయం పలువురిలో వ్యక్తమవుతోంది. ఇకనైనా జాతీయ రహదారి నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్న అధికారులు ఘాట్‌లో ప్రమాదాలు జరగకముందే కొండలను దొలిచిన ప్రదేశాలలో రక్షణ ఏర్పాట్లపై దృష్టి సారించాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.



చూపరులను ఆకట్టుకునేలా దర్శనమిస్తున్న రోడ్డు



ఎస్ ఆకార మలుపు వద్ద ప్రమాదకరంగా కొండ అంచు

ఇద్దరు గిరిజనులకు సీఎం రిలీఫ్ ఫండ్‌తో శస్త్ర చికిత్సలు



ఊపిరితిత్తుల వ్యాధికి శస్త్ర చికిత్స చేయించుకున్న సంధ్యారాణి

కొయ్యూరు, నవంబరు 16 , (ఆంధ్రజ్యోతి): ఇద్దరు గిరిజన రోగులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా శస్త్ర శికిత్సలు చేయించినట్టు సామాజిక సేవకుడు అర్జున్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాడేరు మండలం వంతాడపల్లి పంచాయతీ సప్పిపుట్టుకు చెందిన సంధ్యారాణి యువతికి ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధితో బాధపడుతూ విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. అలాగే, కొయ్యూరు మండలం గంపరాయి కిచెందిన ఏలియా శరభన్నపాలెంలో చదువుతున్నాడు.ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారి పడటంతో బాలుడి కుడి కాలు విరిగిపోయింది. అతనిని విశాఖ కేజీహెచ్‌కు కుటుంబ సభ్యులు తరలించారు. ఈ ఇద్దరి శస్త్ర చికిత్స కోసం ఆరోగ్యశ్రీలో నమోదు కాలేదు. దీంతో అర్జున్‌రెడ్డి చొరవ తీసుకుని కలెక్టర్ దినేశ్‌కుమార్, ఐటీడీఏ పీఓ అభిషేక్, డీఎంహెచ్‌వో జమాల్ బాషా దృష్టికి బాధితుల కష్టాన్ని వివరించారు. వారి ఆదేశాలతో సీఎం రిలీఫ్ ఫండ్ విడుదల కావడంతో ఈ ఇద్దరి రోగులకు శస్త్ర చికిత్సలను పూర్తి చేశారు.

కర్రిగుడలో సమస్యల పరిష్కారానికి కృషి

- టీడీపీ అరకు ఇన్‌చార్జి, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ దొన్నుదొర



గ్రామంలోని గిరిజనులు మాట్లాడుతున్న దొన్నుదొర

అనంతగిరి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కర్రిగుడ గ్రామంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని టీడీపీ అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి, ఆర్టీసీ రీజనల్ ఛైర్మెన్ సీవేరి దొన్నుదొర గిరిజనులకు హామీ ఇచ్చారు. శనివారం మారుమూల గుమ్మ పంచాయతీ కర్రిగుడ గ్రామానికి సుమారు 8 కిలో మీటర్లు కాలినడకన ఆయన వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డోలీమోతలతో గిరిజనులు ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని, ప్రస్తుతం ప్రభుత్వం సుమారు రూ.7కోట్లతో రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టినట్టు తెలిపారు. అలాగే తాత్కాలిక పాఠశాల షెడ్డు, తాగునీటి సదుపాయం కల్పించేలా అధికారులకు సూచిస్తామని, అటవీ భూములకు పట్టాలిచ్చేలా ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్తామన్నారు. కూటమి ప్రభుత్వంలోని గిరిజన గ్రామాలను అభివృద్ధి చేస్తామని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమం బొర్రా సర్పంచ్ జన్ని అప్పా రావు, , నాయకులు సోవేరి సుబ్బారావు, పి. రవీంద్ర, వెంకట్, దీసరి అర్జున్, గంగరాజు, శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

'మత్తుతో జీవితాలను నాశనం చేసుకోవద్దు'



బుర్రకథ ప్రదర్శన

ముంచంగిపుట్టు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు ఎంత దూరంగా ఉంటే జీవితాలు అంత బాగుంటాయని స్థానిక ఎస్ఐ జె.రామకృష్ణ అన్నారు. ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాలతో మండలంలోని మారుమూల లక్ష్మీపురం, బరడ, మాకవరం, రంగబయలు తదితర పంచాయతీల్లో పోలీసుల ఆధ్వర్యంలో శనివారం జన జాత కళా మండలి ద్వారా గంజాయితో కలిగే అనర్థాలపై బుర్రకథ రూపంలో అవగాహన కల్పించారు. గంజాయి, సారా తదితర మత్తు పదార్థాలకు అందరూ దూరంగా ఉండాలని ఈ ప్రదర్శనలో కోరారు. యువత చదువుకుని మంచి ఉద్యోగాలు సంపాదించాలని, అలాగే ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిసారించి ఆర్థికంగా ఎదగాలని ప్రజలకు సూచించారు. సర్పంచులు త్రినాథ్, గంగాదర్, నోబిన తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



లోతుగెడ్డజంక్షలో శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ గోపాల్

చింతపల్లి, నవంబరు 16 , (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లోతుగెడ్డజంక్షన్‌లో శనివారం స్థానిక సర్పంచ్ సమిడి గోపాల్ సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుని గ్రామాలను అభివృద్ధి చేయాలన్నారు. గ్రామంలో మిగిలిన సీసీ రోడ్లు నిర్మించేలా ఎంపీ, ఎమ్మెల్యేల సహకారంతో చర్యలు చేపడతామన్నారు. అనంతరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఈశ్వరమ్మ ఆలయాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఉల్లి లక్ష్మయ్య, మాజీ వైస్ ఎంపీపీ బి. కృష్ణారావు, గ్రామ పెద్దలు రామకృష్ణ, రమణరాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి: ఎక్సైజ్ సీఐ



మాట్లాడుతున్న సీఐ కూర్మారావు

సీలేరు, నవంబరు 16, (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు వ్యసనాలు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూ రంగా ఉండాలని చింతపల్లి ఎక్సైజ్ సీఐ కూర్మారావు అన్నారు. శనివారం చింతపల్లి సమీపంలోని ఆర్ఐటీఐలో నవోదయం పేరిట విద్యార్థులకు డ్రగ్స్, మద్యం, గంజాయి తదితర మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అప్పారావు, హెచ్‌సీలు చిన్న, నాయుడు, ఆర్ఐటీఐ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యాటకులకు నిరాశ మిగిల్చిన మేఘాల పర్వతం



వంజంగి మేఘాల పర్వతంపై పర్యాటకులు

పాడేరురూరల్/ సీలేరు నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వాతావరణంలోని మార్పులతో శనివారం వంజంగి మేఘాల పర్వతాన్ని సందర్శించిన పర్యాటకులకు నిరాశ మిగిలింది. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రకృతి ప్రియులు, పర్యాటకులు శనివారం ఉదయం ఈ పర్వతం వద్దకు చేరుకున్నారు. పాల సముద్రాన్ని తలపించే మంచు మేఘాలు, సూర్యోదయం వేళ భానుడి కిరణాలు పర్యాటకులకు ఆశించే విధంగా కానరాలేదు. మంచు ప్రభావంతో ఈ పరిస్థితి నెలకొనడంతో నిరాశతో వెనుదిరిగారు. సీలేరు దట్టంగా మంచు కురిసింది. ప్రకృతి దృశ్యాలు ఆకట్టుకున్నాయి.

పిక్నిక్‌ల సందడి



వనభోజనాల్లో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థునులు

చింతపల్లి, నవంబరు 16 , (ఆంధ్రజ్యోతి) : చింతపల్లి జూనియర్ కాలేజీ విద్యార్థులకు శనివారం వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భం గా విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎంతో ఉత్సాహంగా ఆట, పాటలతో సందడి చేశారు. డీజే సౌండ్స్‌తో డ్యాన్సులు, గిరిజన సాంప్రదాయమైన ధింసా నృత్యాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. మధ్యాహ్నం వనభోజనాలు కార్యక్రమం అనంతరం విద్యార్థులు ప్రిన్సిపాల్ శివకుమార్, వార్డెన్ పసుపులేటి వినాయరావులను ఘనంగా సన్మానించారు.

నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలు సీజ్ :ఎస్ఐ



కాశీపట్నం వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ, సిబ్బంది

అనంతగిరి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని స్థానిక ఎస్ఐ డీ.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని కాశీపట్నం వద్ద శనివారం డ్రంక్అండ్ డ్రైవ్ నిర్వహించారు. అరకువైపుగా వచ్చే వాహనాలను ఆపి, తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ఎన్ఆర్‌పురం ఘాట్‌రోడ్డులో ఇటీవలే జరిగిన ప్రమాదం దృష్టిలో పెట్టుకుని, అధికలోడులతో వాహనాలు వెళ్తే.. తప్పనిసరిగా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పిక్నిక్‌లకు వ్యాన్‌ల్లో అధిక సంఖ్యలో ప్రయాణించి ప్రాణాలమీదకు తెచ్చుకోవద్దన్నారు. కాదని నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని అన్నారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పథకం నిధులతో అభివృద్ధి పనులు



పేటమాలిపుట్టులో రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ పాండురంగస్వామి

ముంచంగిపుట్టు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో గల దారెల పంచాయతీ పేటమాలిపుట్టు గ్రామంలో నూతన సీసీ రోడ్డు పనులకు ఆ పంచాయతీ సర్పంచ్ పి.పాండురంగస్వామి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నిధులు రూ. లక్షలు వెచ్చించి సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని అన్నారు. నాణ్యత పరిమాణం పాటిస్తూ రోడ్డును వేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ గిరీష్‌దొర, ఉప సర్పంచ్ మధు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా నాయకులు రాజబాబు, అమర్

పాడేరురూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలుపుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ జల్లి రాజుబాబు, కో- కన్వీనర్ అమర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆటో డ్రైవర్లు చలో విజయవాడ కార్యక్రమానికి మద్దతుగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం అంబేడ్కర్ కూడలి వద్ద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్నికల ముందు ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా దీనిపై మాట్లాడక పోవడం విచారకమన్నారు. ఆటో డ్రైవర్లకు మోటారు వాహన కార్మికులకు ప్రభుత్వం పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, జీవో 21, 31లను రద్దు చేయాలని, ప్రమాదంలో మరణించిన డ్రైవర్లకు రూ. 10 లక్షలు, అనారోగ్యంతో మృతిచెందిన వారికి రూ. 5 లక్షలు చెల్లించాలని, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు మున్నా, శాంతిబాబు, ఆనంద్, గణేష్, వెంకటరమణ, వంశీ, లక్ష్మణ్, ఈశ్వర్ పాల్గొన్నారు.

జాతీయ గౌరవ దివస్‌లో అరకు కాఫీ స్టాల్

- గిరిజన ఉత్పత్తుల ప్రదర్శన... హాజరైన ఐటీడీఏ పీవో అభిషేక్



బిహార్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న పీవో అభిషేక్, గిరిజనులు

పాడేరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గిరిజన యోధుడు భగవాన్ బిర్సాముండా 150వ జయంతిని పురస్కరించుకుని కేంద్రం ప్రభుత్వం బిహార్ రాష్ట్రంలో శుక్రవారం నిర్వహించిన జన జాతీయ గౌరవ దివాస్ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో అభిషేక్ పాల్గొన్నారు. అరకులోయ మండలం కొత్తభల్లుగుడకు చెందిన గిరిజనులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అరకులోయ కాఫీ, ఇతర గిరిజన ఉత్పత్తులతో అక్కడ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రధాని నరేంద్రమోదీ హాజరయ్యారు. పీఎం జన్‌మన్ యోజనలో భాగంగా గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ప్రధాని పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి తీసుకువచ్చి ప్రదర్శించిన గిరిజన ఉత్పత్తులను ఆయన పరిశీలించారు.

జీడిమామిడి రైతులకు పంటల బీమా

పాడేరురూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జీడిమామిడి తోటలకు 2025-25 ఆర్థిక సంవత్సరంలో స్వచ్ఛంద బీమా పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని ఉద్యానవన అధికారి ఎ.రమేశ్‌కుమార్‌రావు తెలిపారు. రైతులు ఎకరాకు రూ. 1,540 ప్రీమియం చెల్లిస్తే, బీమా హామీ రూ. 30,800 ఉంటుందన్నారు. పంట రుణం తీసుకోని రైతులు ఈబీమాను పీఏసీఎస్, సీఎస్‌సీ, స్థానిక బ్యాంకులలో చెల్లించాలన్నారు. పంట రుణం తీసుకున్న రైతులు నేరుగా బ్యాంక్ సిబ్బందిని సంప్రదించాలన్నారు. రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం తదితర ధ్రువ పత్రాలతో ఈ నెల 22వ లోగా ప్రీమియం చెల్లించాలన్నారు. ఇతర వివరాలకు ఫీల్డ్ కో-ఆర్డినేటర్ యు.అప్పన్న ఫోన్: 80088 48024కు లేదా సమీప రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు.

అరకులోయలో పర్యాటకుల జోరు



అరకులోయలో ట్రైబల్‌మ్యూజియం వద్ద పర్యాటకులు

అరకులోయ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అరకులోయలో వీకెండ్ రోజైన శనివారం ఓ మోస్తరుగా పర్యాటకులు వచ్చారు. అరకులోయలో మ్యూజియం, పద్మాపురం గార్డెన్‌తోపాటు ఘాట్‌రోడ్‌లో ఉన్న సుంకరమెట్ట కాఫీతోటలు, గాలికొండవ్యూపాయింట్, గన్నెల షూటింగ్‌స్పాట్‌లను సందర్శించారు. అరకులోయలో ట్రైబల్‌మ్యూజియం ప్రవేశ ద్వారం, పక్కన ఉన్న ఐలవ్‌యూ అరకు బోర్డు వద్ద ఫొటోలు దిగుతూ సందడి చేశారు. మ్యూజి యం ఆవరణలో బోటుషికారు చేస్తూ కొం దరు, యువతీ,యువకులు సాహస క్రీడల్లో భాగంగా స్కైసైక్లింగ్, జిప్‌లైనర్‌లో ప్రయాణిస్తూ హుషారుగా కనిపించారు. అనంతరం మ్యూజియంను తిలకించారు. పద్మాపురం గార్డెన్ సందర్శించారు. టోయ్‌ట్రైన్‌లో గార్డెన్‌లో అందాలను తిలకించారు. హాట్‌ఎయిర్‌బెలూన్‌ను సందర్శించడంతో పాటు భాట్‌ఎయిర్‌బెలూన్‌లో అరకు అందాలను వీక్షించారు. వేకువ జామున అరకులోయకు సమీపంలో ఉన్న మాడగడసన్‌రైజ్ హిల్స్ వద్దకు వెళ్లి ప్రకృతి సోయగాలను చూసి ఆనంద పరవశులయ్యారు. థింసా కళాకారులతో నృత్యం చేస్తూ, మరికొంతమంది గిరిజనులవస్త్రధారణలో మంచు అందాలను ఆస్వాదించారు. పొగమంచులో ఉదయించే సూర్యోదయం దృశ్యాలను తిలకిస్తూ ఫొటోలు, వీడియోల్లో చిత్రీకరించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్య కళాకారులకు మెమొంటోల అందిస్తున్న ఆలయ ధర్మకర్త

ఆహూతులను అలరించిన విశాఖ వాగ్దేవి నృత్యాలయ చిన్నారుల నృత్యాలు

పాడేరురూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసోత్సవాల్లో భాగంగా పాడేరులోని పురాతన శైవక్షేత్రం ఉమానీలకంఠేశ్వరస్వామి సమేత రాజరాజేశ్వరి ఆలయంలో గత రెండు రోజులుగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆహూతులను అలరించాయి. ఆలయ ఆధ్యాత్మిక సేవా బృందం ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో ఈ ప్రదర్శనలను ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నాయుడు పర్యవేక్షణలో నిర్వహించారు. విశాఖపట్నం వాగ్దేవి నృత్యాలయం, హంస వాహిని శ్రీమాధవ సంగీత ఆలయం, స్థానిక చిన్నారులు ఆలపించిన సంకీర్తనలు, నృత్యాలు అలరించాయి. కళాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి ఉప్పల వెంకటరత్నం, శిక్షకులు సౌందర్య సురేష్, మ్యూజిక్ టీచర్ గసాడి వెంకట గణపతి, కటారి వెంకటరమణ, ఈవో దేశిది బాబూరావు, కొట్టగుళ్లి రామారావు, వంతినిభ రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ ఈశ్వరి



సమావేశంలో పాల్గొన్న సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు

గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలి

- సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు నిలదీత
- ఎంపీడీవో హామీతో యథావిధిగా మండల సమావేశం

డుంబ్రిగుడ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలం సర్వసభ్య సమావేశానికి సమయపాలనపాటించకుని, గైర్హాజరైన అధికారులపై ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఎంపీపీ ఈశ్వరీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఉదయం 11 గంటలకు హాజరు కావాల్సిన కొన్ని శాఖ అధికారులు ఆలస్యంగా 12గంటల తర్వాత హాజరయ్యారు. అది కూడా మండల స్థాయి అధికారులు సిబ్బందిని పంపించారు. దీంతో ప్రతిసారి సమావేశానికి ఇలాగే వస్తున్నారని, తీరు మార్చుకోవాలని ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులతోపాటు ఇతర ప్రజా ప్రతినిధులు మండిపడ్డారు. తక్షణమే సమయపాలన పాటించని అధికారులపై చర్యలు తీసుకుంటారని స్పష్టమైన సమాధానం చెప్పాలంటూ ఎంపీడీవోను పట్టుబట్టారు.

దీంతో ఎంపీడీవో గైర్హాజరైన అధికారులపై చర్యలపై కలెక్టర్‌కు నివేదిక పంపిస్తామని హామీ ఇవ్వడంతో సభ్యులు సమావేశాన్ని కొనసాగించారు. గతంలో సమస్యలు ఎంత వరకు పరిష్కారమయ్యాయో అధికారులు చెప్పిన తర్వాత మిగిలిన చర్చ జరపాలని సభ్యులు నిలదీశారు. మారుమూల గ్రామాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సమయపాలన పాటించకుండా విధులు చేపడుతున్నారని, అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని కితలంగి, గసభ కంద్రుం పంచాయతీల సర్పంచులు ఎంతవోకు ఫిర్యాదు చేశారు. మండంలోని నాడు-నేడు ద్వారా పంచాయతీ పరిధిలో నిలిచిపోయిన పాఠశాల భవనాలు, అంగన్‌వాడీ భవనాలను పూర్తి చేయాలని కోరారు. మండలంలోని ఐసీడీఎస్ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, చిన్నారులు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని సర్పంచుల ఫోరం అధ్యక్షుడ హరి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, వైస్ ఎంపీపీలు ఆనంద్, లలిత, ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

గుడికి చేరువలో మద్యం దుకాణాలు

▸▸ రెండు షాపులను మూసివేయించిన ఎక్సైజ్ అధికారులు

చోడవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గుడికి చేరువగా రెండు మద్యం దుకాణాలను ఏర్పాటు చేశారు. స్థానిక ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో వాటిని ఎక్సైజ్ అధికారులు శనివారం మూసివేయించారు. పట్టణంలోని ఆంధ్రా బ్యాంకు జంక్షన్ వద్ద రెండు మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. ఈ రెండు దుకాణాలకు సమీపంలోనే ప్రధాన రహదారికి రెండో వైపున స్వయంభూ విఘ్నేశ్వరాలయం ఉంది. ఎండోమెంట్ దేవాలయం కావడంతో రెండు మద్యం దుకాణాలకు సంబంధించి వంద మీటర్ల దూరంలో దుకాణాలు ఉండాలన్నది నిబంధన. ఈ రెండు దుకాణాలు దాదాపు వంద మీటర్లకు దరిదాపుగా ఉండడంతో రెండు దుకాణాలను కొనసాగించే విషయంలో తర్జనభర్జన నెలకొంది. ఇదే సమయంలో ఈ రెండు దుకాణాలకు చెందిన వ్యాపారులు అధికార తెలుగుదేశం పార్టీకి మద్దతుదారులు కావడంతో అధికారులు, ఎక్సైజ్ అధికారులు ఏ నిర్ణయానికి రాలేకపోయినట్టు సమాచారం. దీంతో జిల్లా ఎక్సైజ్ ఉన్నతాధికారులు కూడా జోక్యం చేసుకుని మరోసారి రెండు దుకాణాలకు కూడా కొలతలు నిర్వహించారు. అయినా దేనిని తొలగించాలో, దేనిని కొనసాగించాలో తేల్చుకోలేక డైలమాలో పడినట్టు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రెండు దుకాణాలు కూడా తొలగించాలని వ్యాపారులకు ఇటీవల స్పష్టం చేసి ఈ నెల 15వ తేదీ వరకూ గడువు విధించారు. ఈలోగా వ్యాపారులు ఓ నిర్ణయానికి రాలేకపోవడంతో శనివారం ఎక్సైజ్ అధికారులు రెండు దుకాణాలను కూడా మూసివేయించారు.

కాగా, ఈ రెండు దుకాణాలకు చెందిన వ్యాపారులు తమ దుకాణం వినాయకుడి గుడికి దూరంగానే ఉందని, నిబంధనల ప్రకారం తమ దుకాణం కొనసాగించే అవకాశం ఉన్నప్పటికీ ఎక్సైజ్ అధికారులు బలవంతంగా మూసివేయించారని ఆరోపిస్తున్నారు. దీనిపై ఎక్సైజ్ సీఐ కేవీపీ నాయుడును వివరణ కోరగా గుడి, బడి నిబంధనల మేరకే ఈ రెండు దుకాణాలు మూసివేయించామని స్పష్టం చేశారు. కాగా పట్టణం నడిబొడ్డున మద్యం దుకాణాలను మూసివేయించడం చర్చనీయాంశమైంది.



చోడవరం పట్టణంలో ఎక్సైజ్ అధికారులు మూసి వేయించిన మద్యం దుకాణాలు ఇవే...


పోలీసు అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న సివిల్ జడ్జి

లోక్ అదాలత్ విజయవంతం చేయండి

నర్సీపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 14 జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) షియాజ్ ఖాన్ సూచించారు. శనివారం కోర్టు సముదాయంలో పోలీసు అధికారులతో డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ రాజీ పడదగిన సివిల్, క్రిమినల్ కేసుల కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. దీనివల్ల సమయం, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేసి పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం డీఎస్పీ మోహన్‌రావు, సీఐలు గోవిందరావు, రేవతమ్మ, పలువురు ఎస్ఐలు పాల్గొన్నారు.

గవర సంక్షేమానికి కృషి చేద్దాం..

▸▸ గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర


గవర కార్పొరేషన్ చైర్మన్‌ను సత్కరించిన డైరెక్టర్ గంగాధర్, ఇతర సభ్యులు

చోడవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో గవర కులస్థుల సంక్షేమానికి డైరెక్టర్లంతా కలిసికట్టుగా పాటుపడదామని రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర తెలిపారు. గవర కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన మండలానికి చెందిన మండల టీడీపీ అధ్యక్షుడు బొడ్డేడ నాగగంగాధర్ శనివారం అనకాపల్లిలో మళ్ల సురేంద్ర నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన గవరల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, అందరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషిచేద్దామని స్పష్టం చేశారు.

ఇంటర్ యూనివర్సిటీ బాక్సింగ్ పోటీల్లో మౌనికకు గోల్డ్ మెడల్


గోల్డ్ మెడల్ సాధించిన మౌనికను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాజు

నర్సీపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ యూనివర్సిటీ బాక్సింగ్ టోర్నమెంట్‌లో బొంతు మౌనిక గోల్డ్‌మెడల్ సాధించారు. ఈ మేరకు మౌనికను ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. రాజు అభినందించారు. శనివారం కళాశాల ఆవరణలో మౌనికకు ఆయన ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న మౌనిక శుక్రవారం ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన ఇంటర్ యూనవర్సిటీ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలలో గోల్డ్ మెడల్ సాధించి జాతీయ స్థాయి ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. గౌహతిలో జరిగిన జాతీయ స్థాయి బాక్సింగ్ టోర్నమెంట్, మహారాష్ట్రలోని బుస్వాల్ జరిగిన ఆల్ ఇండియా మహిళల బాక్సింగ్ టోర్నమెంట్‌లో వరుసగా బంగారు పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎస్.ఎస్ కృష్ణ, పీడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ


రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న డీఎస్పీ మోహన్‌రావు

నర్సీపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా ఏపీ యూడబ్ల్యూజే నర్సీపట్నం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఏరియా ఆస్పత్రి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. శనివారం డీఎస్పీ మోహన్‌రావు, పట్టణ, రూరల్ సీఐలు గోవిందరావు, రేవతమ్మ చేతుల మీదుగా 150 మంది ఇన్ పేషెంట్ రోగులకు పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మోహన్‌రావు మాట్లాడుతూ పత్రికా దినోత్సవం సందర్భంగా జర్నలిస్టుల సేవా కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నాయకులు స్వామి, కిశోర్, చుక్కల రాము, ఎనుకూరి అప్పారావు, ఏడీ బాబు, శ్రీనివాసరవర్మ పాల్గొన్నారు.

పంచాయతీల్లో పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్

▸▸ ముమ్మరంగా పారిశుధ్య పనులు


కాలువలు శుభ్రం చేస్తున్న సిబ్బంది

చోడవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో శనివారం పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. వెంకన్నపాలెం, అంభేరుపురం, గోవాడ, గవరవరం సహా అన్ని పంచాయతీల్లో కాలువలు పరిశుభ్రం చేయడంతో పాటు చెత్తకుప్పలను తొలగించారు. పట్టణంలో పట్టణంలోని కందర్పకాలనీలో స్కూల్, కోఆపరేటివ్ కాలనీ వేంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలోని కాలువల్లో పూడిక తీత కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, ఎంపీడీవో పీఎస్ ఆంజనేయులు, ఈవోపీఆర్డీ మహేష్,ఈవో నారాయణరావు పాల్గొన్నారు.

కె.కాలనీ పాఠశాలలో...

చోడవరంలోని కె.కాలనీ పాఠశాలలో శనివారం పరిశుభ్రం చేశారు. పాఠశాల కమిటీ చైర్మన్ నేమాల హరి ఆధ్వర్యంలో తుప్పలను తొలగించారు. ఎంపీడీవో అంజనేయులు, ఈవోపీఆర్డీ మహేశ్, టీడీపీ నాయకులు మల్లునాయుడు, పెదబాబు, హెచ్ఎం గొల్లు శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు పాలెం నాయుడు, టీడీపీ అధ్యక్షుడు డి.వెంకటఅప్పారావు, యువ నాయకులు సకురు కోటేశ్వరరావు, పంచాయతీ వార్డు సభ్యులు నేమాల ధనలక్ష్మి, తానారపు శ్రీనివాస్, బాలిబోయిన దేముళ్లు, ద్వారపురెడ్డి శ్రీనివాస్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నాటుసారా విక్రయాల నిరోధానికి చర్యలు

కృష్ణాదేవిపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారీ, విక్రయాలు నిరోధానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఎక్సైజ్ సీఐ బి.మధుకుమార్ తెలిపారు. మండలంలో మేజర్ పంచాయతీ ఏఎల్‌పురం గొల్లవీధిలో శనివారం సాయంత్రం నవోదయం కార్యక్రమంపై అవగాహన సదస్సు, ర్యాలీ చేపట్టారు. ఈ సీఐ బి.మధుకుమార్ మాట్లాడుతూ నాటుసారా వల్ల గ్రామాలకు జరుగు అనర్థాలను వివరించారు. నాటుసారా, బెల్ట్‌షాపులు ఇతర విక్రయాలు, రవాణా చేస్తే ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేయాలని, వారిపేర్లు గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మామిడి కృష్ణ గ్రామస్థులు, ఎక్సైజ్ పోలీసు పాల్గొన్నారు.

రామ్మూర్తినాయుడు మృతి బాధాకరం

▸▸ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు మృతి బాధాకరమని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఒక ప్రకటలో శనివారం పేర్కొన్నారు. చంద్రగిరి ఎమ్మెల్యేగా రామ్మూర్తినాయుడు విశేష సేవలు అందించారన్నారు. 1994-99 మధ్యకాలంలో ఎమ్మెల్యేగా ఆయనతో కలిసి పనిచేశానని గుర్తు చేసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

మాకవరపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో సీతామహాలక్ష్మి అన్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం గ్రామాలల్లో అభివృద్ధి కోసం రెండు కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసింది. ఈ నేపథ్యంలోనే శనివారం మండలంలోని శెట్టిపాలెం, వెంకన్నపాలెం, భీమబోయినపాలెం, రామన్నపాలెం గ్రామాల్లో ఉపాధి నిధులతో జరుగుతున్న కాలువులు, సిమెంటు రోడ్లు నిర్మాణాలు, సీసీ డ్రైన్లు, పాఠశాల ప్రహరిగోడ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పనులను సకాలంలో పూర్తిచేయాలని కాంట్రాక్టర్లుకు సూచించారు. ఈ కార్యక్రమంలో శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామునాయుడు పాల్గొన్నారు.

సాగునీటి సంఘం ఎన్నికలకు సన్నద్ధం కండి

నాతవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో సాగునీటి సంఘాల ఎన్నికలకు సమాయత్తం కావాలని జనసేన పార్టీ మండల అధ్యక్షులు వెలగల వెంకటరమణ సూచించారు. మండలంలోని గన్నవరం గ్రామంలో శనివారం జనసేన కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎంతగానో ఉపయోగపడే ఈ నీటి సంఘాల ఎన్నికలల్లో జనసేన పార్టీ తరఫున అభ్యర్థులను నిల్పొని గెలుపొందాలని సూచించారు. ఈ నెల 24 నుంచి 26 వరకు డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలు, 27 నుంచి 29 వరకు జలాశయ కమిటీ ఎన్నికలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన యూత్ మండల అధ్యక్షుడు, నాయకులు బైన మురళి, వేగిశెట్టి శ్రీనివాసు, మాకిరెడ్డి వెంకటరమణ, గుడివాడ అశ్విని, కుమార్, కృష్ణకుమార్, పల్లా నవీన్, పండు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యమ ప్రముఖులకు నివాళులు

చోడవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ ఉద్యమ స్ఫూర్తిదాతలకు శనివారం నివాళులర్పించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉద్యమ స్ఫూర్తిదాతలు ఎస్.ఆర్.రంగనాథ్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాయాధికారి జి.తిరుమల కుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మ్యూజికల్ చైర్ పోటీలు

రావికమతం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కొత్తకోట శాఖా గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు మ్యూజికల్ చైర్ పోటీలు జరిగాయి. ఈ పోటీలను కొత్తకోట గ్రంథ పాలకురాలు వరహాలమణి ఆధ్వర్యంలో నిర్వహించారు. కొత్తకోట పెద్దబడి, ఆర్కిడ్, విద్యాంజలి స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ముగింపు రోజున బహుమతులు ఇస్తామని వరహాలమణి చెప్పారు.

రోలుగుంటలో...

రోలుగుంట: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. అంతకు ముందు గ్రంథాలయ ఉద్యమ కర్తలకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ పోటీల్లో కొమరవోలు, రోలుగుంట, కేజీబీవీ పాఠశాలల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వరలక్ష్మి, ఉపాధ్యాయులు శ్యామల, రేవతి తదితరులు పాల్గొన్నారు.

కంచుగుమ్మలలో స్వచ్ఛతా హీ సేవ

రోలుగుంట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంచుగుమ్మలలో శనివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొని పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. అన్ని వీధుల్లో చెత్తాచెదారం తొలగించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని ఈ సందర్భంగా వారు కోరారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పచ్ బండారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాకవరపాలెంలో...

మాకవరపాలెం: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం స్వచ్ఛతా హీ సేవలో భాగంగా పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఎంపీడీవో సీతాలక్ష్మి పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి మండల పరిషత్ కాంప్లెక్స్ ఆవరణలో చెత్తను తొలిగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతీ శనివారం పరిశుభ్రం చేయాలంటూ ఎంపీడీవో, కార్యదర్శులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాకవరపాలెం ఈవో బాలదొర తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు

రోలుగుంట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెవెన్యూ సదస్సులు శనివారంతో ముగిశాయి. ఆఖరి రోజు మండల కేంద్రం రోలుగుంటలో సభ నిర్వహించారు. తహసీల్దార్ సిహెచ్.నాగమ్మ, ఆర్ఐ రామమూర్తి పాల్గొని రైతుల నుంచి వివిధ భూ సమస్యలపై 30 అర్జీలను స్వీకరించారు. 16 రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వే పూర్తయిందని తెలిపారు. ఈ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ తెలిపారు.

ఏఈవోగా సతీశ్ బాధ్యతలు

రావికమతం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విస్తరణాధికారిగా ముచ్చకర్ల సతీశ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. మాడుగుల మండలం జమ్మదేవిపేట సచివాలయంలో పనిచేస్తూ బదిలీపై ఆయన ఇక్కడికి వచ్చారు.

చినపాచిల చెరకు తూనిక కేంద్రం స్థల సర్వే


అక్రమణలకు గురైన స్థలాన్ని సర్వే చేస్తున్న అధికారులు

రావికమతం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అక్రమణకు గురైన గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి చెందిన చినపాచిల చెరకు తూనిక కేంద్రం స్థలాన్ని శనివారం గ్రామ సచివాలయ సర్వేయర్ సర్వే నిర్వహించారు. 2023లో ఇక్కడ గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి అనుసంధానంగా చినపాచిల చెరుకు తూనిక కేంద్రం ఏర్పాటు కోసం శ్మశాన వాటిక సమీపంలో సర్వే నంబరు-9లో ఒక ఎకరా 30 సెంట్ల ప్రభుత్వం స్థలం కేటాయించాలని రైతులు విజ్ఞప్తి చేశారు. అప్పటిలో ఈ స్థలం కాటా ఏర్పాటుకు కేటాయించాలంటే ప్రభుత్వానికి మార్కెట్ ధర ప్రకారం షుగర్ ఫ్యాక్టరీ డబ్బు చెల్లిస్తేనే ఇవ్వగలమని అప్పటి జిల్లా కలక్టర్ ప్రవీణ్ ప్రకాష్ స్పష్టం చేశారు. షుగర్ ఫ్యాక్టరీ డబ్బులిచ్చి కోనుగోలు చేయలేమని చెప్పడంతో ఫ్యాక్టరీ సభ్యరైతులే చందాలుగా స్థలానికి అవసరమైన సొమ్ము పోగుచేసి అప్పటి మార్కెట్ విలువ ప్రకారం ప్రభుత్వానికి చెల్లించి, ఆ స్థలాన్ని షుగర్ ఫ్యాక్టరీ పేరున కేటాయించారు. దీంతో 2024లో ఎకరా 30 సెంట్లలో చెరకు తూనిక కేంద్రం ఏర్పాటు చేసి, ఇక్కడ నుంచి ఈ ప్రాంత చెరకు రైతుల పండించే చెరకును ప్రతి ఏటా షుగర్ ఫ్యాక్టరీ సరఫరా చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ కాటా స్థలంలో రైతు భరోసా కేంద్రం, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం ఏర్పాటు చేశారు. అలాగే తాపీమేస్త్రీల సంక్షేమ భవనానికి మరికొంత కేటాయించారు. దీంతో కాటా స్థలం అక్రమణలకు గురైందని, అధికారులు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కోరారు. తహసీల్దార్ రమణ ఆదేశాల మేరకు శనివారం సచివాలయ సర్వేయర్ రవి, ఫ్యాక్టరీ అధికారులు, రైతుల సమక్షంలో సర్వే నిర్వహించారు.

కౌన్సిలర్ పద్మావతిని కలిసిన నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రమేశ్


పద్మావతికి పుష్పగుచ్ఛం అందిస్తున్న అప్పల రమేశ్

గొలుగొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం కౌన్సిలర్ చింతకాయల పద్మావతిని నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ రమేశ్ నర్సీపట్నంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిసారు. గొలుగొండ మండం గొలుగొండ గ్రామ పంచాయతీకి చెందిన అప్పల రమేశ్ టీడీపీ గొలుగొం స్టేట్ డైరెక్టర్‌గా నియమించిన విషయం తెలిసిందే. గొలుగొండ మండలానికి అవకాశం ఇచ్చి కూటమి ప్రభుత్వం నియమించడంతో టీడీపీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, గొలుగొండ మాజీ సర్పంచ్ పారేపల్లి నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు కె.రవివరమ్మ, గండేపల్లి రాము, భీమిరెడ్డి నానిబాబు, కొండలరావు కృతజ్ఞత తెలిపారు.

ఘనంగా జర్నలిస్టుల దినోత్సవం

చోడవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రైవేటు కల్యాణ మండపంలో శనివారం జాతీయ జర్నలిస్టు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులంతా కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ సమాజం అభివృద్ధిలో జర్నలిస్టులది కీలక పాత్ర అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన పాత్రికేయులు పాల్గొన్నారు. అలాగే సీనియర్ పాత్రికేయులను విలేకరులంతా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలు మండలాల విలేకరులు, సంఘం నాయకులు డీవీఎం నాయుడు, ప్రభాకర్, దేవకి, శ్రీనివాస్, బాబ్జి, రామచంద్రరావు, ద్వారపురెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

చోడవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం జాబ్‌మేళాను నిర్వహించారు. ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్, స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ వి.అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం నిరుద్యోగ యువత కోసం నిర్వహిస్తున్న ఈ జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జాబ్‌మేళాలో నవత, పేటీఎం తదితర కంపెనీలు యువకులకు ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేశాయి. కార్యక్రమంలో జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి రితీశ్, ఎస్ఎస్ఎస్ పీవోలు మాల్యాద్రి, రత్నభారతి తదితరులు పాల్గొన్నారు.

తూర్పుకాపు మండల అధ్యక్షుడిగా గంటా శ్రీనివాసరావు



నాతవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల తూర్పు కాపు సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా మాధవనగరం గ్రామానికి చెందిన గంటా శ్రీనివాసరావును ఎన్నుకున్నారు. మండల కమిటీ సభ్యులుగా వీసం నాగేశ్వరరావు (మన్యపురట్ల), అప్పన దివాణం (చమ్మచింత), వనిమిన సర్వేస్‌కుమార్, దారబొయిన కనకరాజు (గంగవరం), పల్లా నవీన్ (వైబీ అగ్రహారం), గొర్లి జగదీశ్ (గాంధీనగరం), శివలంక సత్యనారాయణ (వల్లంపేట), శెట్టి దొరబాబు (మాధవనగరం), దొడ్డ లక్ష్మణ్ (మాధవనగరం), కూనిశెట్టి కొండబాబు (మాధవనగరం)ను ఎన్నుకున్నట్టు వారు తెలిపారు. తూర్పు కాపు సంక్షేమానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా అనిల్‌కుమార్ చెప్పారు.

మహనీయులను స్మరించుకోవాలి

నర్సీపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల స్థాపనకు కృషి చేసిన మహనీయులను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా గ్రంథాలయ సంస్థ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు త్రిమూర్తులురెడ్డి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా గ్రంథాలయాల ఉద్యమ నాయకుల సంస్మరణ దినం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ స్థాపనకు కృషి చేసిన గాడిచర్ల హరి సర్వోత్తమరావు, అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారి దమయంతి, పూర్వపు అధికారి మురళీకృష్ణ పాల్గొన్నారు.

నెలలు నిండకుండానే...

అవగాహనతో ప్రీ మెచ్యూరిటీ ప్రసవాలకు చెక్

గర్భం దాల్చినప్పటి నుంచి పోషకాహారం తీసుకోవాలి



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సాధారణంగా గర్భం దాల్చిన 40 వారాలకు ప్రసవం జరగాలి. అయితే, కొంతమంది 27 నుంచి 36 వారాల మధ్య ప్రసవిస్తున్నారు. ఇటువంటి సందర్భాల్లో పుట్టే చిన్నారులను ప్రీమెచ్యూర్ బేబీ (నెలలు నిండకుండా పుట్టే పిల్లలు) అంటారు. ఈ తరహా ప్రసవాల్లో శిశువులకు అనేక అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతుంటాయి. అయితే, కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం, గర్భం దాల్చిన తరువాత నిరంతరం వైద్య పరీక్షలు చేయించడం ద్వారా ఈ తరహా ఇబ్బందులను ముందుగానే గుర్తించేందుకు అవకాశం ఉంది. ప్రీ మెచ్యూర్ ప్రసవాలపై అవగాహన కలిగించే ఉద్దేశంతో ఏటా నవంబరు 17న ప్రీమెచ్యూరిటీ డేగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఏటా భిన్నమైన థీమ్స్‌తో ఈ డే నిర్వహిస్తారు. ఈ ఏడాది 'ఏటా 1.3 కోట్ల మంది చిన్నారులు ముందుగా పుడుతున్నారు. వీరికి నాణ్యమైన వైద్యాన్ని అన్నిచోట్ల అందిద్దాం' అనే థీమ్‌తో నిర్వహిస్తున్నారు. ఆదివారం ప్రీ మెచ్యూరిటీ డే సందర్భంగా అందిస్తున్న ప్రత్యేక కథనం...

నెలలు నిండిన అనంతరం ప్రసవం అయితేనే శిశువు పరిపూర్ణ ఆరోగ్యంతో ఉంటుంది. ఇటువంటి ప్రసవమే తల్లికి, బిడ్డకు శ్రేయస్కరం. అయితే, కొన్ని కారణాల వల్ల 36 వారాలలోపే ప్రసవించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. నెలలు నిండకుండా పుట్టే చిన్నారుల్లో అనేక అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతుంటాయి. ముఖ్యంగా 24 నుంచి 30 వారాల మధ్య పుట్టే చిన్నారుల పరిస్థితి బాగా ఇబ్బందికరంగా ఉంటుంది. మెరుగైన వైద్యాన్ని అందించగలిగినప్పుడు మాత్రమే అటువంటి చిన్నారులను రక్షించుకునే అవకాశం ఉంటుంది. అలాగే 30 వారాలు నుంచి 36 వారాల మధ్య పుట్టే చిన్నారులను మెరుగైన వైద్య సేవలను అందించడం ద్వారా కోలుకునేలా చేయవచ్చు.

- నిరంతరం వైద్య పరీక్షలు చేయించుకుంటుండాలి
- ముందే ప్రసవం అయితే అనేక రకాల సమస్యలు
- నేడు ప్రీ మెచ్యూరిటీ డే

ఇవీ ఇబ్బందులు..

నెలలు నిండకుండా పుట్టే చిన్నారుల్లో ప్రధానంగా ఊపిరితిత్తులు సమస్య తలెత్తే అవకాశం ఉంది. అలాగే గుండె, మెదడు, నాడీ, జీర్ణ వ్యవస్థలు పూర్తిగా ఎదగవు. దీనివల్ల వెంటిలేటర్ సహాయంతో చిన్నారికి కృత్రిమ శ్వాస అందించాల్సి ఉంటుంది. ఐవీ ద్వారా పోషకాలను అందించాలి. నాడీ వ్యవస్థను మెరుగుపర్చేందుకు ఇంకుబేటర్స్‌లో పెట్టాల్సి వస్తుంది. ఈ చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతుంటాయి. ఇన్‌ఫెక్షన్స్ ముప్పు కూడా అధికంగా ఉంటుంది. కాబట్టి, వీరిని నియోనేటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో పెట్టి మెరుగైన వైద్య సేవలను అందించాల్సి ఉంటుంది. అవయవాల్లో ఎదుగుదల లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతుంటాయని వైద్యులు చెబుతున్నారు.

కొన్ని జాగ్రత్తలను పాటించడం ద్వారా ప్రీ మెచ్యూర్ ప్రసవాలను నిలిపే అవకాశం ఉంది. గర్భంతో ఉన్నప్పుడు పోషకాహారాన్ని అందించాలి. అలాగే నిరంతరం వైద్య పరీక్షలు చేయించుకుంటుండాలి. ఇన్‌ఫెక్షన్ బారినపడ కుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎనిమియా వంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి.

వీరిలో ప్రీమెచ్యూర్ ప్రసవాలు ఎక్కువ..

ప్రీ మెచ్యూర్ ప్రసవాలు ఎక్కువగా యూరినరీ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడే వారిలో జరిగే అవకాశం ఉంది. ఫ్లూ జ్వరాలు, డయాబెటిస్ సమస్య, గర్భం దాల్చిన తరువాత బరువులు ఎత్తే పనులు చేసే వారిలో, రక్తహీనత, గుండె జబ్బులు, బీపీ, ఇతర అనారోగ్య సమస్యలు, ఉమ్మనీరు లీక్ కావడం వంటి ఇబ్బందులు/కారణాలు వల్ల ముందస్తు ప్రసవాలు జరుగుతుంటాయి. వైద్యుల సూచనలు పాటించడం ద్వారా ప్రీమెచ్యూర్ ప్రసవాలను నివారించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

ప్రీమెచ్యూర్ ప్రసవాలు ఎక్కువే..

ప్రీ మెచ్యూర్ ప్రసవాలు ఎక్కువగానే జరుగుతున్నాయి. కేజీహెచ్‌లో ప్రతిరోజూ 20 వరకు ప్రసవాలు జరుగుతుంటే, అందులో రెండు నుంచి మూడు ఉంటున్నాయి. నగర పరిధిలోని ఇతర ఆస్పత్రుల్లోనూ ఈ తరహా ప్రసవాలు అధికంగానే జరుగుతున్నట్టు చెబుతున్నారు.



మెరుగైన వైద్యం అందించడం ద్వారా కాపాడవచ్చు



ప్రీ మెచ్యూర్ బేబీలను మెరుగైన వైద్యం అందించడం ద్వారా కోలుకునేలా చేయవచ్చు. బరువు తక్కువగా ఉండడం ప్రధానమైన సమస్యగా ఉంటుంది. కొన్నిసార్లు ఆర్గాన్స్‌లో ఇబ్బందులు ఉంటాయి. నియోనేటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ ఉండే ఆస్పత్రుల్లో ప్రసవాలు చేయించడం ద్వారా బిడ్డ ప్రాణాలను రక్షించవచ్చు. కేజీహెచ్‌లో ప్రతిరోజూ ఈ తరహా ప్రసవాలు రెండు వరకు అవుతుంటాయి. కంగారూ కేర్ యూనిట్ కూడా ఉంది. బిడ్డను తల్లి గుండెలపై పెట్టుకునేలా చేయడం ద్వారా అవసరమైన వేడిని అందిస్తాం. దీనివల్ల నాడీ, ఇంద్రియ వ్యవస్థలు మెరుగుపడతాయి.

- డాక్టర్ కేవీఎస్ఎం సంధ్యాదేవి, గైనకాలజీ విభాగాధిపతి, కేజీహెచ్

యువత ప్రతిభకు గుర్తింపు

» జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్



చిన్నారికి బహుమతి ఇచ్చిన కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : యువజన ఉత్సవాల్లో పాల్గొనడం ద్వారా యువత తమ ప్రతిభను ప్రదర్శించి గుర్తింపు పొంద వచ్చునని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ, నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో గౌరీ గ్రంథాలయంలో శనివారం యువ ఉత్సవ్-2024 వేడుకలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతలో ఆత్మవిశ్వాసం, సామాజిక అవగాహన, సృజనాత్మకత, సామూహిక చైతన్యాన్ని, దేశభక్తిని పెంపొందించేందుకు యువజన ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. యువత సంప్రదాయ కళలు, నృత్యాలు, సంగీతం, నాటకాలు వంటి అంశాల్లో తమ ప్రతిభను ప్రదర్శించడానికి ఈ వేదిక ఉపయోగపడుతుందన్నారు. నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి జి. మహేశ్వరరావు మాట్లాడుతూ యువశక్తి పెంపుదలలో భాగంగా జిల్లాస్థాయిలో సైన్స్ మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన వారు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు పంపడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తూనికలు, కొలతల శాఖ డిప్యూటీ కంట్రోలర్ కె. థామస్ రవికుమార్, కాండ్రేగుల వెంకటరమణ, డాక్టర్ ఎం. జోగారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధ్వాన దారులు అందంగా..

... 5వ పేజీ తరువాయి

వేగవంతం చేస్తున్నారు.

నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి

సంక్రాంతి పండుగ నాటికి మంజూరైన అన్ని రోడ్డు ప్యాచ్ పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని ఆర్ అండ్ బీ జిల్లా అధికారి రమేశ్ తెలిపారు. ఇప్పటికే టెండర్లు ఖరారు చేసి, గడువులోగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు ఆదేశించామన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. నర్సీపట్నం, సబ్బవరంలో రెండు వేర్వేరు రోడ్డు పనులకు టెండర్లు దాఖలు కాలేదని, ఆ రోడ్డు పనులను పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

ప్రతి విద్యార్థికి అపార్ నంబరు

... 5వ పేజీ తరువాయి

హైస్కూల్ నుంచి ఇంటర్మీడియట్ వరకు మొత్తం 2,37,587 మంది విద్యార్థులు ఉండగా, ఇప్పటికే 1,62,825 మందికి నంబర్ల జారీ పూర్తయిందని చెప్పారు. వచ్చే ఏడాది జనవరి మాసాంతం వరకు ఈ నంబర్ల జారీ జరుగుతుందన్నారు. ప్రభుత్వం చేపట్టిన నియామకాల్లో భాగంగా జిల్లాలో కేజీబీవీల్లో 19 మంది సీఆర్‌టీలకు ఇటీవల పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చామన్నారు. నాన్ టీచింగ్ సిబ్బంది నియామకాలకు ఉన్నత విద్య చదివిన అనేకమంది దరఖాస్తులు చేసుకున్నారన్నారు. నాన్ టీచింగ్ పోస్టులకు అభ్యర్థుల ఏడో తరగతి మార్కుల జాబితా, స్థానికత ధ్రువీకరణ పత్రాలు అందజేయాల్సి ఉందన్నారు. జిల్లాలో 24 భవిత సెంటర్లలో విద్యార్థులకు మెరుగైన సేవలు అందుతున్నాయని ఆయన తెలిపారు.

స్కై సైక్లింగ్ ట్రయల్ రన్

... 5వ పేజీ తరువాయి

సముద్రంలోకి ఉంటుంది. ఒకేసారి 40 మంది దానిని సందర్శించేలా పటిష్ఠంగా నిర్మించనున్నట్టు ఆర్‌జే అడ్వెంచర్ ప్రతినిధి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. పీపీపీ విధానంలో రూ.6 కోట్లతో ఈ ప్రాజెక్టులు చేపట్టామన్నారు. ఆర్‌జే అడ్వెంచర్ స్పోర్ట్స్, ఎస్ఎస్ఎం షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్, భారత్ మాత వెంచర్స్ కలిసి జాయింట్ వెంచర్‌గా దీనిని చేపట్టామన్నారు.

విశాఖ డీఆర్ఎం కార్యాలయంలో సీబీఐ విచారణ?

విశాఖపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం రైల్వే డివిజనల్ మేనేజర్ కార్యాలయంలో సీబీఐ అధికారులు శనివారం విచారణ నిర్వహించినట్టు తెలిసింది. ఢిల్లీ నుంచి వచ్చిన సీబీఐ అధికారులు, స్థానిక సీబీఐ సిబ్బంది సహకారం తీసుకున్నట్టు చెబుతున్నారు. అయితే డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ స్థానికంగా లేరు. సెలవులో ఉన్నారు. గతంలో డీఆర్ఎంగా పనిచేసిన అధికారిపై అప్పట్లోనే పలువురు ఫిర్యాదులు చేశారు. ఆ ఆరోపణలపై ఇప్పుడు విచారణకు వచ్చి ఉండవచ్చునని అంటున్నారు.

అంగన్‌వాడీల ఆందోళన

మినీ సెంటర్లను మెయిన్ కేంద్రాలుగా మార్చాలి

» పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి

» నెహ్రూచౌక్ వద్ద ధర్నా

అనకాపల్లి టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక నెహ్రూచౌక్‌లో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు శనివారం ధర్నా నిర్వహించారు. తొలుత సీఐటీయూ కార్యాలయం నుంచి అంగన్‌వాడీలు ప్రదర్శనగా నెహ్రూ చౌక్‌లోని బస్టాప్ వద్దకు చేరుకుని ఆందోళన చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. నాగేషు మాట్లాడుతూ రాష్ట్రంలో గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు అంగన్‌వాడీలు అనేక సేవలందిస్తున్నారన్నారు. మినీ వర్కర్లకు పదోన్నతి ఇవ్వాలని జీవో ఉన్నా సక్రమంగా అమలు కావడం లేదన్నారు. మినీ వర్కర్లకు ఎటువంటి సెలవులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగడం లేదన్నారు. గతంలో 42 రోజులు పాటు సమ్మె సందర్భంగా మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా మార్పు చేస్తామని అప్పటి ప్రభుత్వం అంగీకరించి సర్వే కూడా చేశారన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేస్తూ తక్షణమే జీవో ఇవ్వాలని మినీ వర్కర్లకు వేసవి సెలవులు ఇవ్వాలని కోరారు. వారికి మెయిన్ వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్. శంకరరావు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా తెలుగుదేశం ప్రభుత్వం వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారని, నేటి వరకు ఎటువంటి ప్రస్తావన లేకుండా ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌లను కలిసినా సమస్య పరిష్కారం కాలేదని, ఇచ్చిన జీవోలు కూడా అమలు కావడం లేదన్నారు. ఈ ధర్నాలో యూనియన్ నాయకులు జి. రామలక్ష్మి, వరలక్ష్మి, అంజలి, తనూజ, పార్వతి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ సాధనే లక్ష్యంగా చదవాలి

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా చేసుకొని చదవాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక గౌరీ గ్రంథాలయంలో బీసీ సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన మెగా డీఎస్సీ ఉచిత శిక్షణ శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ లక్ష్యం నిర్ధేశించుకొని కష్టపడి చదివితే ఫలితాలు సాధించవచ్చునన్నారు. విద్యకు, ఉపాధి కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు ద్వారా ప్రోత్సహిస్తుందన్నారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు పునశ్చరణ, పాత ప్రశ్నపత్రాల సాధనతో విజయం సాధించవచ్చునన్నారు. మాక్ టెస్టు రాయడం ద్వారా పనితీరును ఎప్పటికప్పుడు విశ్లేషించుకుని అందుకు అనుగుణంగా ప్రణాళికలో మార్పులు, చేర్పులు చేసుకోవాలన్నారు. మెగా డీఎస్సీ ఉచిత శిక్షణ కేంద్రం డైరెక్టర్ కె.రాజేశ్వరి మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ కులాల అభ్యర్థులకు ఇక్కడ శిక్షణ ఇస్తారని, బయోమెట్రిక్ హాజరు ఉంటుందన్నారు. శిక్షణ కాలంలో 75 శాతం హాజరు నమోదు ఉన్న అభ్యర్థులకు నెలకు రూ. 1500 స్టైఫండ్, డీఎస్సీ మెటీరియల్ కోసం వెయ్యి రూపాయలు అందజేస్తామన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి జి. అప్పారావు నాయుడు మాట్లాడుతూ ఆంధ్రా- ఒడిశా సరిహద్దులో గల మారుమూల గిరిజన తెగకు చెందిన చినిమిగిరి అనే బాలిక చదువే ధ్యేయంగా చేసుకొని ఒడిశా రాష్ట్ర గ్రూప్ వన్ అధికారిగా ఉద్యోగం సాధించి, ఇతరులకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. అనంతరం ఎలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంటు ప్రొఫెసర్ ఎ.అర్జున అప్పారావు రూపొందించిన ఏకలవ్య కరెంటు ఎఫైర్స్ పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ కమిటీ సభ్యులు కాండ్రేగుల వెంకటరమణ, ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.జోగారావు తదితరులు పాల్గొన్నారు.

జ్వాలా తోరణంలో అపశ్రుతి

» ముగ్గురికి గాయాలు



గాయపడిన వారిని పరామర్శిస్తున్న నీలబాబు

అనకాపల్లి టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక చినరాజుపేటలో శుక్రవారం రాత్రి కార్తీక పౌర్ణమి సందర్భంగా జరిగిన జ్వాలా తోరణం కార్యక్రమంలో అపశ్రుతి చోటుచేసుకుంది. జ్వాలాతోరణం మధ్యలోంచి భక్తులు అటు ఇటు తిరుగుతున్న సమయంలో జ్వాలా తోరణానికి కట్టిన వైరు ఒక్కసారిగా తెగిపడడంతో పలువురు గాయపడ్డారు. వెంటనే ఎన్టీఆర్ వైద్యాలయానికి వారిని తరలించారు. గాయపడిన వారిలో ఎం. శ్రీను, సంతోష్, వై. శ్రీనుల శరీరాలకు బలమైన గాయాలయ్యాయి. మరికొందరికి స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఎన్టీఆర్ వైద్యాలయంలో చికిత్స పొందుతున్న బాధితులను టీడీపీ 84వ వార్డు ఇన్‌చార్జి మాదంశెట్టి నీలబాబు శనివారం పరామర్శించారు. గాయపడిన వారి పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యసేవలందించాలని నీలబాబు వైద్యాలయం డాక్టర్‌లను కోరారు. ఈయన వెంట 84వ వార్డు టీడీపీ జనరల్ సెక్రటరీ తలారి లక్ష్మీప్రసాద్, స్థానికులు ఉన్నారు.

బాలికపై అత్యాచారం

నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు

పరవాడ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బాలికను ప్రేమిస్తున్నానని నమ్మించాడు..ఆపై కిడ్నాప్ చేసి అత్యాచారానికి పాల్పడ్డాడు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని పోక్సో యాక్ట్ కింద కేసు నమోదుచేశారు. ఇందుకు సంబంధించి అనకాపల్లి జిల్లా పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ శనివారం రాత్రి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి.

ఏలూరు జిల్లాకు చెందిన సూర్య (30) అనకాపల్లి సమీపంలోని కొండుపాలెంలో గల కోళ్లఫారంలో కొన్నేళ్లుగా సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఆ కోళ్లఫారంలో ఓ బాలిక (15) పనిచేస్తున్నది. ఆమెకు సూపర్‌వైజర్ ప్రేమ పేరుతో మాయ మాటలు చెప్పాడు. ఆ బాలిక సమీపంలోని ఒక గ్రామంలో సోదరి వద్ద ఉంటోంది. ఈనెల 12న బాలిక సోదరి ఇంట్లో లేని సమయంలో సూర్య అక్కడకు వెళ్లి ఆమెను ఏలూరు తీసుకువెళ్లిపోయాడు. తన చెల్లి కనిపించడం లేదని అదేరోజు రాత్రి బాలిక సోదరి పరవాడ పోలీసులు ఫిర్యాదు చేసింది. పోలీసులు అదృశ్యం కేసుగా నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. బాలికను సూర్య తీసుకువెళ్లినట్టు గుర్తించారు. శుక్రవారం ఇద్దరినీ అక్కడ నుంచి పరవాడ స్టేషన్‌కు తీసుకువచ్చారు. వైద్య పరీక్షల నిమిత్తం బాలికను అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యానికి తరలించారు. మాయమాటలతో బాలికను లోబరుచుకొని కిడ్నాప్, ఆపై అత్యాచారం చేసిన సూర్యపై బీఎన్ఎస్ 64 (2) (ఎం), 65 (1), 87, పోక్సో యాక్ట్ కింద కేసు నమోదుచేశారు. నిందితుడిని ఆదివారం మేజిస్ట్రేట్ ముందు హాజరు పరుస్తామని డీఎస్పీ సత్యనారాయణ వెల్లడించారు. ఈ సమావేశంలో సీఐ మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	92.00
లైవ్ ధర	112.00
విత్ స్కిన్	194.00
స్కిన్ లెస్	204.00


కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

క్రైం... crime news

బావిలో పడి వివాహిత మృతి

దేవరాపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కాశీపురం శివారు చిటిమిరెడ్డిపాలెంకు చెందిన చిటిమిరెడ్డి లక్ష్మి (57) అనే వివాహిత ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందిందని హెచ్‌సీ సైడిరాజు శనివారం తెలిపారు. మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. చిటమిరెడ్డి లక్ష్మి భర్త సత్తిబాబు మూడేళ్ల క్రితం మృతి చెందాడు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరు తమ కుటుంబాలతో విశాఖపట్నంలో ఉంటున్నారు. ఒంటరిగా ఉంటున్న లక్ష్మి ఈనెల 14 సాయంత్రం కార్తీక మాసం సందర్భంగా దీపాలు వెలిగించడానికి వెళ్లి తిరిగి రాలేదు. శనివారం ఉదయం ఆమె మృతదేహం బావిలో కనిపించడంతో ఆమె మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

ఫార్మా బస్సు ఢీకొని బాలుడి మృతి..



పవన్ కుమార్ (ఫైల్ ఫొటో)

అగనంపూడి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఓ ఫార్మా కంపెనీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యానికి ఏడేళ్ల బాలుడు మృతి చెందాడు. రోడ్డు దాటుతున్న బాలుడిని బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే తనువు చాలించాడు. జాతీయ రహదారి అగనంపూడి సమీపంలో గల బీసీ కాలనీ వద్ద శనివారం ఉదయం ఈ ప్రమాదం చోటుచేసుకొంది. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా చోడవరం మండలం లక్కవరం శివారు మామిడిపల్లికి చెందిన దొగ్గ దేముళ్ల ఫార్మాసిటీలో ఓ కంపెనీలో పని చేస్తూ స్థానికంగా కుటుంబంతో కలిసి ఉంటున్నారు. రోజూ మాదిరిగానే శనివారం ఉదయం ఆయన డ్యూటీకి బయలుదేరారు. తండ్రితో పాటు సమీపంలో గల బస్టాప్‌నకు వెళ్లిన పవన్‌కుమార్ (7) జాతీయ రహదారిపై గల డివైడర్‌ను దాటి తిరిగి ఇంటికి వస్తుండగా ఫార్మాసిటీ నుంచి నగరానికి వస్తున్న ఓ ఫార్మా కంపెనీ బస్సు వేగంగా వచ్చి ఢీకొంది. బాలుడి తల పైనుంచి బస్సు చక్రాలు వెళ్లడంతో ఘటనా స్థలిలోనే మృతిచెందాడు. పవన్‌కుమార్ స్థానికంగా గల ఓ ప్రైవేటు పాఠశాలలో రెండో తరగతి చుదువుతున్నాడు. తమ కుమారుడిని బస్సు రూపంలో మృత్యువు కబళించడంతో తల్లిదండ్రులు దేముళ్ల, దేవీలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

16కిలోల గంజాయితో యువకుడి అరెస్టు

కృష్ణాదేవిపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం పాతకృష్ణాదేవిపేట-బంగారంపేట రహదారిలో శనివారం 16 కిలోల గంజాయితో యువకుడిని అరెస్టు చేసినట్టు కృష్ణాదేవిపేట ఎస్ఐ వై.తారకేశ్వరరావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలిలా వున్నాయి. పాతకృష్ణాదేవిపేట-బంగారంపేట రహదారిలో వాహనాలు తనిఖీ చేస్తుండగా మచిలీపట్నంనకు చెందిన కాగిత జశ్వంత్ స్కూటీపై వస్తుండగా అనుమానంతో అతని వద్ద గోనెసంచిని తనిఖీ చేయగా 16 కిలోల గంజాయి పట్టుబడిందన్నారు. అతని వద్ద గంజాయిని, స్కూటీ, సెల్ ఫోన్‌ను స్వాధీనపర్చుకున్నట్టు ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. నిందుతున్ని విశాఖపట్నం సెంటల్ జైలుకు తరలించామన్నారు.

72 మద్యం సీసాలతో ఒకరి అరెస్టు

కశింకోట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జమాదుల పాలెంలో మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ శాఖ ఎస్ఐ వైఎల్.నాయుడు తెలిపారు. గ్రామానికి చెందిన పక్కుర్తి సత్తిబాబు వద్ద 72 మద్యం క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు అతనిని రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు.